తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
15 ఆగస్ట్ 2026



Follow :

# కలవరమాయె కాంగ్రెస్‌లో..!!



## చల్లారని 'క్యాంప్' చిచ్చు

### కార్పొరేషన్ ఎన్నిక చిచ్చు చల్లబడలేదా?

### కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పులా..?

### ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ అనుచరుల మాటల యుద్ధం

**కాంగ్రెస్ పార్టీ అంటే సాధారణంగా ఒక అభిప్రాయం అందరికీ ఉంది. అదే అపరిమితమైన స్వేచ్ఛ ఆ పార్టీలో ఉంటుంది. ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు. అది కాంగ్రెస్ పార్టీలో ప్లస్ అదే మైనస్ కూడా.**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్ట్ 14 (జనంసాక్షి) :**
అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ని మించిన పార్టీ వేరొకటి లేదు. అయితే అసంతృప్తులు అయినా అసమ్మతులు అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది. కానీ బాహాటం అయితే పార్టీ ఇబ్బందుల్లో పడతుందని అంటున్నారు. పాలమూరు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చినప్పటికీ, అక్కడ మొదలైన రాజకీయ చిచ్చు నేటికీ ఆరకపోవడం స్థానిక నేతల్లో తీవ్ర కలవరాన్ని రేపుతోంది. అధికారంలోకి వచ్చామన్న ఆనందం కంటే, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు తెచ్చిపెట్టిన కొత్త తలనొప్పులతో పార్టీ శ్రేణులు సతమతమవుతున్నాయి.మేయర్ కుర్చీ ఎంపిక లో కొందరి ఆశలు తలకిందులై వారి అంచనాలు ఒక్కసారిగా మారిపోయాయి . మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ సతీమణి మేయర్ పీఠాన్ని దక్కించుకుంటారని పార్టీలో బలంగా వినిపించింది. అయితే, చివరి నిమిషంలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారిపోయాయి. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ మరొక మహిళా ప్రజాప్రతినిధి పేరు తెరపైకి రావడం, ఆమె మేయర్ కుర్చీని అధిరోహించడం వేగంగా జరిగిపోయాయి. ఇక్కడి నుంచే పాలమూరు కాంగ్రెస్‌లో అసలు కథ మొదలైంది.రెండు ముక్కలుగా పాలమూరు కాంగ్రెస్.. కార్యకర్తల్లో అయోమయం నెలకొంది . మేయర్ ఎన్నికల అనంతరం పాలమూరు పట్టణ కాంగ్రెస్ స్పష్టంగా రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒకవైపు ఎమ్మెల్యే వర్గం, మరోవైపు డీసీసీ అధ్యక్షుడి వర్గం గా మారి వారు విడివిడిగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తుండటంతో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. "అధికారంలోకి వచ్చామని సంతోషించాలా.. లేక పార్టీ రెండుగా ముక్కలైందని బాధపడాలా?" అంటూ సగటు కార్యకర్త ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి ప్రస్తుతం పాలమూరులో నెలకొంది.

## సోషల్ మీడియాలో అనుచరుల ఫోన్ రికార్డింగ్

**బీసీ నాయకులపై అనుమానమా?**

ప్రస్తుతం మహబూబ్‌నగర్ పట్టణంలో ఒక ఫోన్ సంభాషణ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు నారగోని అంజయ్యకు, డిప్యూటీ మేయర్ అనుచరుడికి మధ్య జరిగినట్లుగా చెబుతున్న మాటల యుద్ధం సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ ఆడియో లీక్‌తో కాంగ్రెస్ అంతర్గత విభేదాలు మళ్లీ మొదటికి వచ్చాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ సంభాషణల నేపథ్యంలో 'బీసీ నాయకులను పార్టీలో అనుమానిస్తున్నారా?' అనే కొత్త కోణం తెరపైకి రావడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది.రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకుంటుందా?కార్పొరేషన్ ఎన్నికల వేడి ముగిసినా 'క్యాంప్' చిచ్చు మాత్రం ఇంకా మండుతూనే ఉంది. ఈ అంతర్గత వివాదానికి ఎప్పుడు ముగింపు పడుతుందో తెలియక స్థానిక కేడర్ అంతుచిక్కని జవాబుల కోసం ఎదురుచూస్తోంది. ఈ తీవ్రమైన వివాదానికి స్వస్తి పలకాలంటే రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు తక్షణమే జోక్యం చేసుకోవాలని, సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని పాలమూరు కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నాయి. మరి అధిష్ఠానం ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

## కేటీఆర్ ఆఫ్ సిరిసిల్ల ఎమ్మెల్యే..

# మై వనపర్తి కా ఎమ్మెల్యే.. క్యా ఫరక్ హే?

### బీఆర్ఎస్ మాజీ నేతలు ఇష్టారీతిగా మాట్లాడొద్దు: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

### సంయమనం పాటిస్తున్నాం.. బలహీనులం కాదు

### హద్దులు దాటితే కాంగ్రెస్ కార్యకర్తలు గట్టిగా బదులిస్తారు

### పోతిరెడ్డిపాడుపై ఇప్పుడు ప్రేమ ఎందుకు? బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించిన ఎమ్మెల్యే

**వనపర్తి బ్యూరో ఆగస్టు 14 (జనంసాక్షి)**
బీఆర్ఎస్ మాజీ నాయకులు పనీపాట లేకుండా విహారయాత్రలు చేస్తూ ఇష్టారీతిగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. కేటీఆర్ సిరిసిల్ల ఎమ్మెల్యే అయితే నేను వనపర్తి ఎమ్మెల్యే నని ఇందులో తేడా ఏముందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి బాధ నుంచి ఇంకా బయటపడలేక తప్పుడు సమాచారంతో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. శుక్రవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్రంగా స్పందించారు. అధికారంలో ఉన్నందున తాము సంయమనం పాటిస్తున్నామని, అంతమాత్రాన తాము భరిస్తున్నామని భావించవద్దని అన్నారు. హద్దులు దాటి వ్యక్తిగత విమర్శలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు గట్టిగా స్పందిస్తారని హెచ్చరించారు.

**పోతిరెడ్డిపాడుపై ఇప్పుడు ప్రేమ ఎందుకు?**

బీఆర్ఎస్ నేతలు పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్లడంపై ఎమ్మెల్యే ప్రశ్నలు సంధించారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నిబంధనల ప్రకారం తీసుకెళ్లాల్సిన నీటి కంటే అధికంగా నీరు తరలిపోతుంటే అప్పటి పాలకులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. జూరాల లెఫ్ట్ మెయిన్ కెనాల్, రాజీవ్ భీమా ఫేజ్-2, కేఎల్ఐ ద్వారా వనపర్తి నియోజకవర్గంలో 90,741 ఎకరాలకు సాగునీరు అందుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నీ 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించినవేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో వనపర్తి నియోజకవర్గానికి ఒక్క ఎకరం అదనంగా సాగునీరు అందించారా? అందించి ఉంటే లెక్కలు చెప్పాలని సవాల్ విసిరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల తరబడి పూర్తి చేయకుండా వదిలేసిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కమీషన్ల కోసం




టెండర్లు పిలిచి ప్రాజెక్టును ఆలస్యం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కూడా తొందరపడి పూర్తి చేసి చివరకు సమస్యల్లోకి నెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు, ఇతర పెండింగ్ బిల్లులకు రూ.4 వేల కోట్లు చెల్లించినట్లు తెలిపారు. పాలమూరు ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వనపర్తి ప్రజలకు ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఒక్క రోజులో 4 టీఎంసీల నీరు ఎలా పారుతుంది?**

ఆగస్టు 1న ఎల్లూరు, ఆగస్టు 2న సింగోటం-జొన్నలబొగుడ, ఆగస్టు 3న గుడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తాము విలేకరుల సమావేశం నిర్వహిస్తామని చెప్పినందుకే నీటిని విడుదల చేశారంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఒక్క రోజులో 4 టీఎంసీల నీరు ఎలా పారుతుందో కనీస అవగాహన ఉన్నవారు చెప్పాలని అన్నారు. నీటి ప్రవాహం, ప్రాజెక్టుల నిర్వహణపై అవగాహన లేకుండా మాట్లాడటం మానుకోవాలని సూచించారు.

**86 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి :** ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు విజయవంతంగా పూర్తి చేశారని ఎమ్మెల్యే తెలిపారు. డబుల్ ఓట్లను తొలగించడం వల్ల వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లో ఓట్ల సంఖ్య తగ్గిందని చెప్పారు. మొత్తం వనపర్తి సెగ్మెంట్‌లో 86 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ఈ నెలాఖరులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వనపర్తి పర్యటనకు రానున్నారని తెలిపారు. విమర్శకు ప్రతి విమర్శ ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత విమర్శలకు దిగితే కాంగ్రెస్ శ్రేణులు కూడా అదే స్థాయిలో స్పందిస్తాయని ఎమ్మెల్యే మేఘారెడ్డి హెచ్చరించారు. సంయమనం పాటిస్తున్నామని బలహీనులమని భావించవద్దని, హద్దులు దాటితే కాంగ్రెస్ శ్రేణుల నుంచి గట్టి సమాధానం తప్పదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరి రాములు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన రాజకీయ ప్రచారానికి పరిమితం కాకూడదు



- సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి: సీఎం రేవంత్ రెడ్డి కి లేఖ
- ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, ఆగస్టు 14(జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా పర్యటనను రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా జిల్లా అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరారు. ఈ మేరకు సీఎంకు ఆయన శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని 19 మండలాలు, సుమారు 397 గ్రామాలకు సాగునీరు అందించే సంగమేశ్వర-బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు తక్షణం నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే సుమారు 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా సంగారెడ్డి, సదాశివపేట మార్కెట్ యార్డుల పనులు, ఎస్ డి ఎఫ్, టి యు ఎఫ్ ఐ డి సి నిధులు, ఆత్మకూర్--సింగూర్ రహదారి, ఎం ఆర్ ఆర్ రోడ్ల పనులను పూర్తి చేయాలని కోరారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను వెంటనే ప్రారంభించాలని, మినీ హజ్ హౌస్‌కు అదనంగా రూ.2 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇస్నాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగించాలని, సంగారెడ్డి మహబూబ్ సాగర్ చెరువును జలవిహార్ తరహాలో అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ను సంగారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త హామీల కంటే గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, జీవోలు జారీ చేయడంతో పాటు నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.

# విద్యుత్ ఘాతంతో ఎద్దు మృతి



**కంగ్టి, ఆగస్టు 14(జనంసాక్షి):** విద్యుత్ ఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని ముకుందా నాయక్ తండాలో జరిగింది. తండాకు చెందిన గిరిజన రైతు రాథోడ్ దేవిదాస్ ప్రతిరోజు మాదిరిగా తన ఎద్దులను వ్యవసాయ పనులకోసం శుక్రవారం ఉదయం పొలానికి తీసుకెలుతుండగా మార్గ మధ్యలో మేత మేస్తున్న క్రమం లో ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ ఘాతానికి గురై రూ 90 వేల విలువ చేసే ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. వ్యవసాయమే జీవనాదారంగా ఉన్న తనకు ఎద్దు మృతి తో తీవ్ర నష్టం వాటిల్లిందని బోరున విలపిస్తున్నాడు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న తరుణం లో ఒక ఎద్దు చనిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి తనకు తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

# నేను కాదు.. నువ్వు' సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

- NSS అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 14 (జనంసాక్షి):**
జాతీయ సేవా పథకం (NSS) 'Not Me But You' అనే నినాదంతో చేపట్టిన అవగాహన ర్యాలీలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..** 'Not Me But You' అనే నినాదం విద్యార్థుల్లో సేవా భావం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు స్ఫూర్తి నిస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలోనూ చురుకు గా పాల్గొనాలని సూచించారు.
NSS ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవా దృక్పథం వంటి విలువలు విద్యార్థుల్లో పెంపొందుతాయని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, మాదకద్రవ్యాల నిర్మూలన, ఆరోగ్యం, విద్యపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు.




ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఈ ర్యాలీ ప్రజల్లో సామాజిక బాధ్యతపై అవగాహన పెంచేందుకు దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 'నేను కాదు.. నువ్వు' అనే సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, NSS ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**శివ్వంపేట, ఆగస్ట్ 14(జనంసాక్షి):** మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ ఆటో డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్క గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చింగనగారి మహేశ్ (53) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 13న రాత్రి భోజనం అనంతరం బాత్‌రూమ్‌కు వెళ్లిన మహేశ్ ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానంతో తలుపు తెరిచి చూడగా ఇనుప రాడ్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని కనిపించాడు.వెంటనే అతడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# పాము కాటుతో మహిళ మృతి



- ఆకునూరులో విషాదం

**చేర్యాల, ఆగస్టు 14(జనంసాక్షి):** పాము కాటుతో ఓ మహిళ మృతి చెందిన విషాద ఘటన చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బత్తుల పద్మ (55) ఈ నెల 8న తన వ్యవసాయ భూమిలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి పద్మ మృతి చెందారు. పాము కాటుకు గురైనప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆమె కోలుకుంటారని ఆశించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతురాలు పద్మకు భర్తతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న పద్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆమె మృతితో బంధువులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు సూచిస్తున్నారు. పొలాల్లో పాములు సంచరించే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. పద్మ మృతితో ఆకునూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వం వెంటనే వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు మంజూరు చేయాలి

## ఎంపీడీవోకు

# వినతి పత్రం అందిస్తున్న మండల సర్పంచులు

**నంగునూరు, ఆగస్టు 14(జనంసాక్షి):**
ప్రభుత్వం వెంటనే వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు మంజూరు చేయాలని శుక్రవారం రోజు మండల సర్పంచులు ఎంపీడీవో ప్రభాకర్ రావుకు వినతి పత్రం అందించారు.



ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో వృద్ధాప్య,బిడి పెన్షన్లు మంజూరు చేయక చాలా రోజులు అవుతుందని అర్హులైన లబ్దిదారులు ఎదురుచూస్తూ ఉన్నారు కాబట్టి తక్షణమే ప్రభుత్వం బీడీ,వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా

# సర్పంచుల చైతన్య సదస్సును విజయవంతం చేయాలి

- తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెశీట్టేపల్లి పురుషోత్తం రెడ్డి

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సర్పంచుల హక్కులు, అధికారాలు, గౌరవ వేతనం, గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసు కోవాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెశీట్టేపల్లి పురుషోత్తం రెడ్డి డిమాండ్ చేశారు. సర్పంచుల సమస్య లపై చైతన్యం తీసుకురావడంతో పాటు వారి హక్కుల సాధన కోసం ఈ నెల 20న నిర్వహించనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సర్పం చుల చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పురుషోత్తం రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామపంచాయతీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో సర్పంచులు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ, వారికి తగిన అధికారాలు, నిధులు, గౌరవం లభించడం లేదని ఆయన అన్నారు.ప్రస్తుతం సర్పంచులకు అందుతున్న రూ.6,500 గౌరవ వేతనాన్ని కనీసం రూ.25 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీల పరిపాలనలో సర్పంచుల పాత్రను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు విరుద్ధంగా ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను కొనసాగించడం వల్ల పాలనా పరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసి, గ్రామపంచాయతీ పరిపాలనలో సర్పంచులకు పూర్తి అధికారాలు కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీల విద్యుత్ బిల్లుల భారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పురుషోత్తం రెడ్డి డిమాండ్ చేశారు. మైనర్ గ్రామపంచాయతీలకు రూ.5 లక్షలు, మేజర్ గ్రామపంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున తక్షణమే నిధులు విడుదల చేసి గ్రామాల్లో నెలకొన్న ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిధుల కొరత కారణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని అన్నారు. సర్పంచుల సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు వారికి శాసన మండలి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఆయన కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పి స్తే గ్రామీణ స్థానిక సంస్థల సమస్యలను శాసన మండలిలో ప్రశ్నించే అవకాశం మరింత బలపడుతుందని అన్నారు.రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించాలని పురుషోత్తం రెడ్డి కోరారు. గ్రామపంచాయతీలకు వచ్చే ఆదాయం నేరుగా ఆయా గ్రామపంచాయతీల ఖాతాల్లోనే జమ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించే నిధులను కూడా నేరుగా గ్రామపంచాయతీల ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీల అభివృద్ధి, పరిపాలనలో సర్పంచుల పాత్రను తగ్గించే విధంగా ఉన్న ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి, సర్పంచులకు సర్వాధికారాలు కల్పించాలని ఆయన కోరారు. గ్రామస్థాయిలో ప్రజలతో నేరుగా సంబంధం కలిగి ఉండే సర్పంచులకు తగిన అధికారాలు, నిధులు అందించినప్పుడే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.
ఈ నెల 20న నిర్వహించనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సర్పంచుల చైతన్య సదస్సుకు ఉమ్మడి జిల్లా పరిధిలోని సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరై తమ హక్కులు, సమస్యలు, డిమాండ్లపై ఐక్యంగా గళం వినిపించాలని పురుషోత్తం రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు వీరోజు సుప్రియ మురళి, వెల్దండ మండల అధ్యక్షులు భాగ్యమ్మ, సర్పంచులు రాం భీష్మ, వెంకటయ్య, శ్రీలత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రం విద్యార్థులకు ఆటలతో అభ్యాసం..

- ప్లే మెటీరియల్ పంపిణీ
- తండ్రి జ్ఞాపకార్థం ఎంఈఓ ఉమారాణి సేవా కార్యక్రమం



**కొల్చారం, ఆగస్టు 14(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో భవిత కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు కార్యాచరణ ఆధారిత అభ్యాసన కు సంబంధించిన విద్య ఆట వస్తువులను ను శుక్రవారం పంపిణీ చేశారు. మండల విద్యాధికారి ఉమా రాణి తండ్రి, స్వర్గీయ కే.సాయిలు (రిటైర్డ్ ఎంఆర్వో) జ్ఞాప కార్థం, మండల విద్యాధికారి ఉమా రాణి ఆధ్వర్యంలో ఈ విద్య ఆట వస్తువులను భవితా కేంద్రంలోని విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉమా రాణి మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంలో కార్యచరణ ఆధారిత అభ్యాసం ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఆసక్తి, చురుకుదనం, ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ మెటీరియల్‌ను వినియోగించా లని భవిత కేంద్రం సిబ్బందికి సూచించారు. అందించిన ప్రతి వస్తువును విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేయాలని తెలిపారు.ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభ్యసనానికి తోడ్పడే ఈ సేవా కార్యక్రమం పట్ల భవిత కేంద్రం సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు మండల విద్యాధికారి ఉమారాణికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోభవితా కేంద్రం సిబ్బంది ఆకాష్, నిఖిత, పాఠశాల సిబ్బంది నారాయణ, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

## రంగంపేటలో ఘనంగా తిరంగా యాత్ర

- జాతీయ జెండాలతో విద్యార్థుల ర్యాలీ
- దేశభక్తి, జాతీయ ఐక్యత చాటిన యువత

**కొల్చారం, ఆగస్టు 14 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరం గా' కార్యక్రమంలో భాగంగా కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో శుక్రవారం తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. బీజేపీ కొల్చారం మండల అధ్యక్షుడు ఘనపూర్ హరీశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థినీ, విద్యార్థులు జాతీయ జెండాలు చేత బట్టి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రంగంపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొల్చారం ఎస్ఐ మొయిద్దీన్, రంగంపేట గ్రామ సర్పంచ్ అరిగి స్వర్ణలత విజయ్‌కుమార్ హాజరయ్యారు.

ర్యాలీ విజయవంతానికి సహకరించిన విద్యార్థులు, ఉపా ధ్యాయులు, పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా మండల కన్వీనర్ చిట్టుకుల గిరి, బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గ్యానిసింగ్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు యాదగిరి, మెదక్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్, ఎస్టీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు శివలాల్, మండల ప్రధాన కార్యదర్శి రవికాంత్ నేత, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు మలా వత్ అంజి, మండల ఉపాధ్యక్షులు రవిగౌడ్, వెంకట్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ గీతా స్కూల్‌లో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**తూప్రాన్, ఆగస్టు 14(జనంసాక్షి):** తూప్రాన్‌లోని గీతా స్కూల్‌లో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి, జాతీయ సమైక్యత, సర్వమత సామరస్యాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను చాటారు. విద్యార్థులు కలిసి భారతదేశ పటాన్ని ఆకారంలో ఏర్పాటు చేయడంతో పాటు, పటం చుట్టూ "మేము భారతీయులం" అనే అక్షరాకారంలో నిలబడి దేశభక్తిని చాటారు. ఈ అద్భుతమైన ప్రదర్శనను చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**హత్నూర, ఆగస్టు 14 (జనంసాక్షి):** ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హత్నూర మండలం దేవుని గుట్ట తండాకు చెందిన గన్య సిరిపురం నుండి తన ద్విచక్ర వాహనంపై తండా కు వెళ్తున్న క్రమంలో అదే తాండాకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముందుగా వెళుతున్న గన్య మోటార్ సైకిల్ ను ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు గన్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు.

## శాస్త్రోక్తంగా ఆండాళ్ గోదా దేవి తిరు నక్షత్రోత్సవ పుట్టినరోజు



**చేర్యాల, ఆగస్టు 14(జనం సాక్షి):** ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి ప్రేమ సేవలతో సాక్షాత్ దేవుడినే పొంద వచ్చని ఆచరించి చూపిన మానవరూప మూర్తి శ్రీ ఆం డాళ్ గోదా దేవి పుట్టినరోజు చేర్యాల పట్టణంలోని శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులు శేషాచర్యులు రాజు స్వామి వైభవంగా నిర్వహించారు. సుప్ర భాత సేవ, తిరుమంజనం, పంచసూక్త, పంచామృత అభిషేకం ద్రవిడ ప్రబంద సేవకాలం పాశురతనియ విన్నపం ఇత్యాది శాస్త్రోక్త విధులచే కన్నులపండుగగా నిర్వహించిన ఈ తిరు నక్షత్రోత్సవం లో సరోజిని, పద్మ, లక్ష్మి, సరిత, హరిన, గీత, వనిత, గాయత్రి లతోపాటు పలువురు మహి ళలు, భక్తులు పాల్గొన్నారు.

## వరి పంటలు వద్దు ఆరుతడి పంటలే ముద్దు: ఏడీఏ సంధ్యారాణి



**శివ్వంపేట, ఆగస్టు 14(జనంసాక్షి):** ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు వరి పంటలు సాగు చేయొద్దని, ఆరుతడి పంటలు వేయాలని నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి పేర్కొన్నారు. శివ్వం పేట మండలం చిన్న గొట్టిముక్ల గ్రామానికి చెందిన యాదగిరి రావు అనే రైతు తన వ్యవసాయ భూమిలో సాగు చేసిన ఆయిల్ పామ్‌లో అంతర పంటగా వరి వెదజల్లే పద్ధతిలో వరిని సాగు చేశాడు. అతడికి ఆత్మ సౌజన్యంతో శుక్రవారం మైక్రోన్యూట్రి యంట్స్ రైతుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## జీనియస్ స్కూల్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ





**సదాశివపేట, ఆగస్టు 14(జనంసాక్షి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకుని జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు శుక్రవారం పట్టణంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. గాంధీచౌక్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 80 అడు గుల జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ఉత్సాహం గా పాల్గొనగా, స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలు ఆకట్టు కున్నాయి.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ముని పల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్ పర్సన్ రేణుక చిరంజీవి మాట్లాడుతూ విద్యా ర్థుల్లో జాతీయ భావాలు, దేశ సమైక్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ర్యాలీ నిర్వ హించిన విద్యార్థులు, పాఠశాల యాజ మాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మారెడ్డి, కృష్ణగౌడ్, పాఠశాల చైర్మన్ ముద్ద నాగనాథ్, వైస్ చైర్మన్ కూచి శ్రీనివాస్, సెక్రటరీ పోల వెంకటేశం, కర స్పాండెంట్ రఘువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ అమరేం దర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రీతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖర్గేకు జరిగిన అవమానంపై బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి డిమాండ్

**వనపర్తి బ్యూరో, ఆగస్ట్14 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ నాయకుడు మల్లికార్జున ఖర్గేను అవమానించేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. ఖర్గేకు జరిగిన అవమానంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం వనపర్తి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

**ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ..** 84 ఏళ్ల వయసులోనూ ప్రజా స్వామ్యం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న ఖర్గేను అవమా నించడం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానమని అన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన ఖర్గే వంటి సీనియర్ నాయకుడి పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు.

ఖర్గే సమావేశం నిర్వహించిన ప్రదేశాన్ని అభివృద్ధి చేయకుండా, ఆ స్థలాన్ని వివాదాస్పదం చేయడం వెనుక దళిత నాయకుడిని అవమానించే ఉద్దేశం ఉందని ఆయన ఆరోపించారు. దళిత సమాజం నుంచి దేశ అత్యున్నత రాజ కీయ స్థాయికి ఎదిగిన నాయకుడిని గౌరవించాల్సింది పోయి అవమానించడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ దేశ నిర్మాణానికి పునాదులు వేసిందని, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాల కల్పనలో కీలక పాత్ర పోషించిందని మేఘారెడ్డి పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుని



ప్రతిపక్ష నాయకులపై ఒత్తిడి తెచ్చినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వెనక్కి తగ్గబోరని స్పష్టం చేశారు.

విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ధర్నా చేస్తే వారి గొంతు వినాల్సిన ప్రభుత్వం అణచివేతకు పాల్పడటం సరికాదని అన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శన మని విమర్శించారు.

ఖర్గేను అవమానించడం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, దేశంలోని కోట్లాది దళితులు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని అవమానించడ మేనని మేఘారెడ్డి అన్నారు. వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున ఖర్గేకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బ్రహ్మచారి, తిరుపతయ్య, బి.కృష్ణ, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్‌లో..

# "మెడ్ ప్లస్ ఫార్మసీ"ని ప్రారంభించిన మాజీ ఎంపీ



**న్యాల్‌కల్, ఆగస్టు 14(జనంసాక్షి):** సాధారణంగా నగరాలు, పట్టణాల్లో మాత్రమే కనిపించే ఫార్మసీలు (మెడిసిన్ విక్రయాల కేంద్రాలు) గ్రామీణ ప్రాంతాలకు సైతం చేరుకున్నాయి. మండల కేంద్రం, సమీప గ్రామాల ప్రజానీకానికి చేరువగా రాయితీ ధరలతో వివిధ రకాల మందులను అందజేసేందుకు తాజాగా ఫార్మసీని ప్రారంభించారు. శుక్రవారం న్యాల్‌కల్ లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన "మెడ్ ప్లస్ ఫార్మసీ"ని జహీరాబాద్ మాజీ ఎంపీ, భాజపా నేత బీబీ పాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి, తదితరులు హాజరై ఫార్మసీని ప్రారంభించారు. పేదలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, తదితరులకు మెరుగైన రాయితీ ద్వారా వివిధ రకాల మందులను అందజేసి ఆదుకోవాలని నిర్వాహకులకు వారు సూచించారు. ప్రత్యేక పూజలు చేసి ఫార్మసీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫార్మసీ నిర్వాహకులు పట్లోళ్ల ప్రశాంత్ కుమార్, న్యాయవాది మాణయ్య, అధికార, విపక్ష పార్టీ శ్రేణులు సిద్ది లింగయ్య స్వామి, ప్రవీణ్ కుమార్, శరణయ్య స్వామి, రఫీయోద్దీన్, సత్యనారాయణ, సతీష్ కుమార్, నిర్వాహక కుటుంబ సభ్యులు పట్లోళ్ల గోపాల్, సుదర్శన్, సతీష్ కుమార్, మహేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను అందజేసిన సర్పంచ్



**కోహెడ, ఆగస్టు 15(జనంసాక్షి):** మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు, అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు యూనిఫామ్‌లను గ్రామ సర్పంచ్ పోలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, చిన్నారుల విద్యాభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. స్కూల్ యూనిఫామ్ ల పంపిణీతో విద్యార్థుల్లో ఆనందం, ఉత్సాహం నెలకొందని విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, అంగన్వాడి చిన్నారుల సంక్షేమానికి గ్రామపంచాయతీ కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీ బిక్షపతి, విఓ అధ్యక్షురాలు జేరిపోతుల రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు



**చిన్నంబావి, ఆగస్టు 14 (జనంసాక్షి):** చిన్నంబావి మండలం బెక్కెం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుడు నరసింహ మౌనిక ఆహ్వానం మేరకు నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త కళ్యాణ్‌కుమార్, చిదంబర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి లబ్ధిదారుడు నరసింహ మౌనిక కుటుంబ సభ్యులతో కలిసి అడుగుపెట్టి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కళ్యాణ్ రావు, చిదంబర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు లేని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయడం అభినందనీయమన్నారు.

గతంలో సొంతింటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో భరోసాను కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై గృహప్రవేశం చేసుకున్న నరసింహ కుటుంబానికి అభినందనలు తెలియజేస్తూ, కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ విద్యాసాగర్‌రావు, తూర్పుంటి కురుమూర్తి, హోటల్ రాముడు, కురుమూర్తి, ఉమేష్ నాయుడు, చిన్న పుల్లయ్య, ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, నరసింహ మౌనిక కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర వేడుకలకు ముస్తాబైన కార్యాలయాలు



**న్యాల్‌కల్, ఆగస్టు 14(జనంసాక్షి):** ఈనెల 15 ఆగస్టున 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. ఆయా కార్యాల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుండి 9 గంటల లోపు మండలంలోని తహసిల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ విశ్వవిద్యాలయం, కళాశాలలు, వ్యవసాయ పరిశోధన క్షేత్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సహకార సంఘాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, తదితర ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**మల్దకల్, ఆగస్టు 14(జనంసాక్షి):** మండల పరిధిలోని బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డే వెంకటన్న (60)అనారోగ్యంతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గత రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న వెంకటన్న, గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల సేవించగా గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు సలహా మీదకు సరైన వైద్యం కోసం వెంటనే కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూశుక్రవారం అర్ధరాత్రి 12:40 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

## పెద్ద శంకరంపేటలో తిరంగా ర్యాలీ....



**పెద్ద శంకరంపేట, ఆగస్టు 14 (జనంసాక్షి):** మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేత పట్టుకొని పట్టణ పురవీధుల గుండా తిరంగా ర్యాలీ నిర్వహించారు.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలో గాంధీ చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా న్యూ బస్టాండ్ లమీదుగా విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాను పట్టణ పురవీధుల మీద ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బీజేవైఎం అధ్యక్షులు బుగుడాల కృష్ణ.. బిజెపి నాయకులు అనిల్, సురేష్ సంస్కార్ విద్యాలయ కరస్పాండెంట్ సీతారామారావు అంజయ్య సుకుమారు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రవీంద్ర శర్మకు అయిత చండీ

# యాగ ఉపాసకరత్న ప్రధానం



**తూప్రాన్, ఆగస్టు 14(జనంసాక్షి):** తూప్రాన్ పట్టణ పరిధిలోని వెంకటాపురం పి.టీలో గల్లకి లలితా పరమేశ్వరి దేవాలయంలో సోమయాజుల రవీందర్ శర్మకు అయితచండీయాగ ఉపాసక రత్న బిరుదును విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో 1980-81జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ,అయుత చండీయాగ నిర్వాహకులు, దేవీ ఉపాసకులు, లలితా పరమేశ్వరీ దేవీ ఆలయ నిర్మాత, లలితా సేవా సమితి వ్యవస్థాపకులు బ్రహ్మ సోమయాజుల రవీంద్ర శర్మకు అయుత చండీ ఉపాసక రత్న అనే బిరుదును అందించి సత్కరించారు. ఈ బిరుదును విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామకృష్ణయ్య చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సంఖ్యలో పాల్గొన్నారు.

# మా భూమిలోనే మమ్ములను ఆగమాగం చేస్తుండ్రు

- రియల్ కేటుగాండ్లపై చర్యలు తీసుకోండి
- జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించండి
- బాధితుల వేడుకోలు



**శివ్వంపేట, ఆగస్ట్ 14 (జనంసాక్షి):** కొంతమంది రియల్ కేటుగాళ్లు జట్టు కట్టి మా భూమిలోనే మమ్ములను ఆగమాగం చేస్తున్నారని అటువంటి వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలనీ శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన చుక్క రాణి, చుక్క శ్రీనివాస్ లు వారి గోడు వెళ్ళాబోశారు. శుక్రవారం మండల కేంద్రమైన శివ్వంపేటలో బాధితులు విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చుక్కా శ్రీనివాస్, చుక్కా రాణి లు మాట్లాడుతూ దొంతి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 433లో 23గుంటల భూమిని హైదరాబాద్ సుల్తానా బజార్ కు చెందిన ఉమేష్ వీర్మాని దగ్గర గత 2013లో భూమిని కొనుగోలు చేశామన్నారు. ఆలా కొనుగోలు చేసిన భూమిలో 11 గుంటలు కబ్జాలో ఉండి ప్రస్తుతం ఉన్న ఇంటి నిర్మాణం చేసుకున్నామని చుక్క రాణి, శ్రీనివాస్ లు తెలిపారు. మిగతా 12 గుంటల భూమికి, సర్వే చేసి, ఆ భూమిని చదును చేయించి, చుట్టూ ఫెన్సింగ్ వేసుకొని ఉన్నామన్నారు. గత 2013లో భూమిని ఖరీదుకు తీసుకొని రిజిస్ట్రేషన్ సమయంలో దొంతి గ్రామానికి చెందిన అమరేందర్ రెడ్డి సాక్షిగా ఉన్నాడని, ఇప్పుడు మేము కొనుగోలు చేసిన భూమిని అమరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి లు మాదంటున్నారని చుక్క రాణి శ్రీనివాస్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. మేము డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన భూమిలోకి ఇతర ప్రాంతాల నుండి దండోరా నాయకులను రప్పించి వాళ్లతో భూతు మాటలు తిట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అంతేకాదు, మీకు ఇక్కడ భూమి లేదని ఇందులోకి వస్తే మాత్రం మిమ్మల్ని చంపుతామని కొంతమంది సిక్కులను మా పైకి ఉసిగొల్పి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

మాపై జరుగుతున్న దౌర్జన్యాల గురించి తూప్రాన్ డీఎస్పీ, శివ్వంపేట ఎస్ఐ ల దృష్టికి తీసుకెళ్లిన మాకు ఎలాంటి న్యాయం జరుగలేదని పోలీసులు స్థానికంగా విచారణ చేయకుండానే మాపైనే కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి విషయంలో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకువచ్చిన, కోర్టు ఉత్తర్వులను పరిగణలోకి తీసుకోకుండా ట్రాక్టర్ తో మాభూమిని దున్నేశారని ఆరోపించారు. మేము లక్షల రూపాయలు డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేయాలని చూస్తూ,ఇతర ప్రాంతాల నుండి మందిని తెచ్చి మమ్మల్ని ఇబ్బందులకు, భయభ్రాంతులకు గురి చేస్తున్న అమరేందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, సహకారం అందిస్తున్న రియల్ బ్రోకర్లపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని, మాకుటుంబానికి న్యాయం చేయాలనీ చుక్క రాణి శ్రీనివాస్ దంపతులు కోరారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న పోలీసులు

- కేసు నమోదు




**కోహెడ, ఆగస్టు 14(జనంసాక్షి):** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బొలెరో వాహనం, అశోక్ లేలాండ్ అను రెండు వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు వివరాలు ప్రకారం మండలంలోని శనిగరం గ్రామ సమీపంలోని దాబా హోటల్ సమీపంలో సిద్దిపేటకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనం స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తరలించినట్లు పోలీస్‌లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనం టిఎస్ 36 టి ఏ 5714, డ్రైవర్ గీకురు రమేష్ తండ్రి బాలరాజు వింజపల్లి గ్రామం పోలీస్ స్టేషన్‌కు తరలించి నిందితుని పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మరొక వాహనం టీజీ 08 టి 9776 కుంచె సతీష్ తండ్రి కనకయ్య 27 సంవత్సరాలు గ్రామం సిద్దిపేట, పట్టుబడిన వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. వీరికి జరిమానాతో పాటు, కఠిన జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఖచ్చితమైన పత్రాలు, ఆధారాలు, సరైన పత్రాలు ఉంటేనే ఇసుకకు అనుమతి ఉంటుందని లేదంటే ఎంతటి వారైనా కేసు, జైలు శిక్ష తప్పదని ఎస్సై హెచ్చరించారు.

## "హర్ ఘర్ తిరంగా" నినాదంతో గద్వాల హోరెత్తింది



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14 (జనంసాక్షి):** "హర్ ఘర్ తిరంగా" పిలుపులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. MALD కాలేజ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్, రాజీవ్ మార్గ్ మీదుగా తిరిగి పాత బస్టాండ్ వద్దకు చేరుకుంది. జాతీయ జెండాలు చేతబూని "భారత్ మాతా కీ జై" నినాదాలతో యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ వ్యాప్తంగా "హర్ ఘర్ తిరంగా" పిలుపుతో ప్రజలు ఇంటింటిపై జాతీయ జెండా ఎగురవేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, జిల్లా హర్ ఘర్ తిరంగా కన్వీనర్ మిర్జాపురం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి, గద్వాల బీజేపీ అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు బండల వెంకట్రాములు, కృష్ణవేణి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, కౌన్సిలర్లు మానస త్యాగరాజు, శాలన్న, చంద్రశేఖర్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగు వద్దు ఆరుతడి పంటల ముద్దు



**గుండుమాల్ ఆగస్ట్ 14(జనంసాక్షి):** గుండుమాల్ మండలంలోని అమ్లికుంట గ్రామంలో కోస్గి అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ బి రామకృష్ణ పంట పొలాలను సందర్శించారు. ప్రస్తుత ఎల్నినో దృష్ట్యా వరిని తగ్గించి ఆరుతడి పంటలకు సాగు చేయాలని ప్రభుత్వ ఆదేశాలతో రైతు రాజేంద్ర బాబు బత్తాయి తోటలో అంతర పంటలుగా మల్చింగ్ షీట్లు మరియు డ్రిప్ ఇరిగేషన్‌ను ఉపయోగిస్తూ పచ్చిమిర్చి, టమోటో, క్యాప్సికమ్ పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మార్గదర్శకత్వంలో జీవామృతం, కషాయాలు ఉపయోగిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నారు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పంపిణీ చేసిన విత్తనాలతో పచ్చిరొట్ట ఎరువు, జిలగా పంటను కూడా సాగు చేస్తున్నారు. రైతులు ఆరుతడి పంటల సాగువైపు దృష్టి సారించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కే. తిరుపతి, జె. నరేందర్, గ్రామ రైతులు పాల్గొన్నారు

## పి.ఎం.శ్రీ పాఠశాలల అభివృద్ధిపై కలెక్టర్ ఆదేశం: నిధుల సద్వినియోగానికి పిలుపు

- పాఠశాలల్లో వసతులు మెరుగుపరచండి
- ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టీకరణ
- నిబంధనల ప్రకారమే కేంద్ర నిధుల ఖర్చు: కలెక్టర్ ఆదేశం



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి):** శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పి.ఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ పాఠశాలల్లో కేంద్ర నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పి.ఎం.శ్రీ ద్వారా పాఠశాలలకు అందిన నిధులను పాఠశాల అవసరాలకు అనుగుణంగా వినియోగించి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా పి.ఎం.శ్రీ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను వచ్చే వారంలోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. పాఠశాలల్లో డ్రైనేజీ, గేట్లు, తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, లైట్లు, ర్యాంపులు తదితర సౌకర్యాల్లో చిన్నపాటి లోపాలు కూడా లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్లలో తలుపులు, లైట్లు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లోని అన్ని ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని సూచించారు. దెబ్బతిన్న తలుపులు, కిటికీలు, ర్యాంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.

పి.ఎం.శ్రీ పాఠశాలలకు నిధుల విషయంలో ఎలాంటి సమస్య లేదు. కేవలం నిధులు ఖర్చు చేసినట్లు చూపించడం కాకుండా, వాటి వినియోగంతో పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు తీసుకోవాలి" అని కలెక్టర్ అన్నారు. త్వరలో పి.ఎం.శ్రీ పాఠశాలలను క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు ఆమె తెలిపారు. వచ్చే వారం నుంచి తన పర్యటనల్లో పీఎం శ్రీ పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రధానోపాధ్యాయులు పాఠశాల వారీగా అవసరాలను ముందుగానే గుర్తించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఖర్చుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలి...**

పి.ఎం.శ్రీ నిధులతో చేపట్టిన ప్రతి పనికి సంబంధించిన ఖర్చుల వివరాలను పాఠశాల రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మరమ్మతు పనులకు ముందు, పనులు పూర్తయిన తర్వాత ఫొటోలు తీసి, వాటితో పాటు తేదీ, జీపీఎస్ కోఆర్డినేట్ల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన ఫైళ్లలో కూడా బిఫోర్–ఆఫ్టర్ ఫొటోలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న స్వీయ రక్షణ శిక్షణను కేవలం నిధుల వినియోగం కోసం నిర్వహించే కార్యక్రమంగా చూడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు వాస్తవంగా స్వీయ రక్షణ నైపుణ్యాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలని, శిక్షణా సామగ్రి, ఇతర వసతులను సమర్థవంతంగా వినియోగించి కార్యక్రమాన్ని ప్రయోజనకరంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు పరస్పరం తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకుని, ఒక పాఠశాలలో విజయవంతమైన కార్యక్రమాలను ఇతర పాఠశాలల్లోనూ అమలు చేసేలా సహకారం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలకు జాక్పాట్... గట్టుకు 3 టీఎంసీలు, గుడ్డెం దొడ్డికి 15 టీఎంసీలు

- రైతుల దశాబ్దాల కల సాకారం: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14 (జనంసాక్షి):** గద్వాల నియోజకవర్గ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం గద్వాల ప్రాంత సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు, నీటి కేటాయింపులు మంజూరు చేసింది.

ఈ మేరకు గురువారం గద్వాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారుగట్టు ఎత్తిపోతల పథకం: ప్రస్తుతం 1.3 టీఎంసీ సామర్థ్యం ఉన్న ఈ పథకాన్ని 3 టీఎంసీలకు పెంచుతూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది.గుడ్డెం దొడ్డి స్టేజ్–1: 1 టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్ ను 15 టీఎంసీలకు విస్తరించాలని నిర్ణయం.నిధుల కేటాయింపు: డి.పి.ఆర్ తయారీ, భూ సేకరణ నిమిత్తం రూ.180 కోట్లు వెంటనే విడుదల. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 1000 ఎకరాల భూమి అవసరం."రైతుల కన్నీరు తుడిచే నిర్ణయం" ఈ నిర్ణయాలతో గద్వాల నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందునుందని, దశాబ్దాలుగా వేధిస్తున్న తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని ఎమ్మెల్యే అన్నారు. రైతుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మొత్తం మంత్రివర్గానికి గద్వాల నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ గట్టు విజయ్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, ఎంపీపీ సుభాన్, జడ్పిటిసి రాజశేఖర్ పాల్గొన్నారు.

## హర్‌ఘర్ తిరంగా యాత్రకు ఘన స్పందన




**చిన్నంబావి, ఆగస్టు 14 (జనంసాక్షి):** హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చిన్నంబావి మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ట్రాక్టర్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు వివేకానంద పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రాష్ట్ర బీజేపీ నాయకుడు కురువ చిన్న మల్లయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గారి శ్రీధర్‌రెడ్డి జాతీయ జెండాలు చేతబూని పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, ఎం.లింగస్వామి, కిరణ్, వెంకటస్వామి, మండ్ల గోపాల్, ఎన్.బాలయ్య నాయుడు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటితో అఖండ సప్తాహభజన ముగింపు



**మల్దకల్, ఆగస్టు14(జనంసాక్షి):** సకాలంలో వర్షాలు కురిసి సుభిక్షంగా పంటలు పండి రైతులు ఆనందంగా ఉండాలని ప్రార్థిస్తూ గత శనివారం ప్రారంభించిన భజన సప్తాహం శుక్రవారం ఏడో రోజుకి చేరుకుంది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముగింపు కార్యక్రమానికి వచ్చి సప్తహ భజనను ముగిస్తారు. ఆలయ అర్చకులు పూజారులు కలిసి గద్వాల సమీపంలో కృష్ణానది నది జలాలతో తీసుకొని వచ్చి గ్రామంలోని అన్ని దేవాలయాలకు అభిషేకాలు చేస్తారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖరరావు, హార్మోనిస్టు రాఘవేంద్ర చారి, రమేష్ ఆచారి, మధుసూదనాచారి, గోపాలు, ప్రసాదాచారి,భజన బృందం సభ్యులు పూజారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేవ కార్యక్రమాలు విస్తృతం చేస్తాం



**తూప్రాన్, ఆగస్టు 14(జనంసాక్షి):** చిట్కుల లక్ష్మీరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సేవలు విస్తృత పరుస్తామని రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ వర్తి ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి తెలిపారు. దండుపల్లి గ్రామంలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు, ప్లేట్లు, ఆట వస్తువులు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు ట్రస్టు ద్వారా పాఠశాలలకు విద్యార్థులకు అవసరమయ్యే వస్తువులు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

# జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

- **2,403 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో**
- **రైతులకు ఎలాంటి కొరత లేకుండా ప్రతిరోజూ నిల్వలు అందిస్తున్నాం**
- **జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్**

**మెదక్ బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి):** జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 2,403 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఇందులో మార్క్‌ఫెడ్ వద్ద 1,855 మెట్రిక్ టన్నులు, రిటైలర్ల వద్ద 548 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఆగస్టు 7, 2026 నుంచి రైతులు ఎరువుల విక్రయాల కోసం ప్రవేశపెట్టిన ఎఫ్ఎస్ఎస్ యాప్ ద్వారా యూరియాను కొనుగోలు చేస్తున్నారని దేవ్‌కుమార్ తెలిపారు. రైతులు తమకు అవసరమైన యూరియా పరిమాణాన్ని యాప్ ద్వారా బుకింగ్ చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ యూరియా నిల్వలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. రిటైలర్ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్లు, రైతు వేదికల వద్ద విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు ఎఫ్ఎస్ఎస్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే విధానంపై



అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. యాప్ వినియోగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బుకింగ్ చేసుకోవడంలో సహాయం అందించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలో యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

# కేటీఆర్ ఆఫ్ సిరిసిల్లకే ఎమ్మెల్యే మై వనపర్తి కా ఎమ్మెల్యే దోనో మే ఫర్ క్యా హై

- **విహార యాత్రల పేరిట తిరుగుతూ దావత్‌లు చేసుకుంటున్నారు...**
- **వనపర్తి నియోజకవర్గంలో 87 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చింది కాంగ్రెస్**
- **ఎన్నికల ముందు ఒక పంపు ఆన్ చేసి హైదరాబాద్ కు వెళ్లేవరకు ఆగిపోయింది....**
- **ఎమ్మెల్యే మేఘరెడ్డి**

**వనపర్తి బ్యూరో, అగస్టు 14 (జనంసాక్షి):** కేటీఆర్ సిరిసిల్ల ఎమ్మెల్యే, నేను వనపర్తి ఎమ్మెల్యేను ఇందులో తేడా ఏముందని, వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని డిసిసి కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత ఎం చేయాలో తెలియక విహార యాత్ర పేరిట ప్రాజెక్టు ల దగ్గరకు వెళుతు దావత్ లు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఏద్దేవా చేశారు. దేశంలో రాష్ట్రములో జూరాల, శ్రీ శైలం, భీమా, నెట్టెం పాడు, కోయిల్ సాగర్ ఇలా ప్రతి ప్రాజెక్టు ను కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. పాలమూరు నాకు భిక్ష పెట్టింది అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని బి ఆర్ ఎస్ అధికారం లోకి వచ్చిందని 8 నెలల ముందు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు శంకుస్థాపన చేసి పడావు పెట్టి 8 నెలల తరువాత కాళేశ్వరం కు శంకుస్థాపన చేసి ప్రాజెక్టు పూర్తి చేసి కూళేశ్వరం చేసారని ఎమ్మెల్యే వివరించారు.

భీమా ఫేస్ 2 ఆన్ చేస్తున్నాం అని అధికారులతో తెలుసుకుని ప్రెస్ మీట్ పెట్టి మేము ప్రెస్ మీట్ పెట్టిన తరువాతనే నీళ్లు వస్తున్నాయని అంటున్నారని అగస్ట్ 1న ఎల్లూర్, 2 న జొన్నలబొగడ, 3న గుడిపల్లి కి నీళ్లు వచ్చాయాని 7వ తేదీన ప్రెస్‌మీట్ పెట్టి వాళ్ళు చెబితే నీళ్లు వస్తే 24 గంటల్లో 4 టిఎంసిల నీళ్లు వస్తాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజి 1,2,3,4 పూర్తి చేసి ముందుకు వెళ్ళాలి రైతులకు ల్యాండ్ అక్వేషన్ చేస్తే రైతులు కమిషన్ ఇవ్వరు కాబట్టి రిజర్వాయర్ కడితే కాంట్రాక్టర్ లు కమిషన్ ఇస్తారు కాబట్టి అవి పూర్తి చేసారని తమ ప్రభుత్వం వచ్చిన తరువాత 30 నెలల్లో 9 రివ్యూ లు పెట్టి ల్యాండ్ అక్వేషన్ పూర్తి చేస్తూ 5 వేల కోట్లు, పెండింగ్ లో ఉన్న 4 వేల కోట్లు బిల్లులను చెల్లించడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. 2023 ఎన్నికల ముందు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు దగ్గర ఒక్క మోటారు ఆన్ చేసి జాతి కి అంకితం



అని చెప్పి ఈ జలాలను తీసుకుని ప్రతి గ్రామం లో దేవుళ్ళకు పూజ చేయమని చెప్పి హైదరాబాద్ కు హెలికాప్టర్ లో వెళ్లే వరకు మోటారు ఆగిపోయిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పొడుగు పొడుగు మాటలు మాట్లాడుతున్న కెటిఆర్ నీవు సిరిసిల్ల ఎమ్మెల్యేవి నేను వనపర్తి ఎమ్మెల్యేను తేడా ఏంటన్నారు. వనపర్తి నియోజకవర్గంలో తనని కూలోడు, పాలోడు, కాంట్రాక్టర్ అని ఏద్దేవా చేసారని తాను ప్రజల కోసం అన్నిటిని భరిస్తానన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే 87 వేల ఎకరాలకు సాగునీరు....**

వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 87 వేల ఎకరాల కు నీళ్లు వచ్చాయాని రికార్డ్ ప్రకారం చెబుతున్నానని ఎమ్మెల్యే అన్నారు. జూరాల ఎడమ కాలువ ద్వారా పెబ్బేరు, శ్రీ రంగాపురంలకు 26,056 ఎకరాలు, రాజీవ్ బీమా ప్యాకేజి 16 ద్వారా 3480 ఎకరాలు, ప్యాకేజి 19 ద్వారా 927 ఎకరాలు, ప్యాకేజి 27 ద్వారా 6617 ఎకరాలు, కె ఎల్ ఐ డి 5 ద్వారా 9259 ఎకరాలు వీటితో పాటు అదనంగా 5315 ఎకరాలు, డి 8 ద్వారా 10136 ఎకరాలు వీటితో పాటు అదనంగా 730 ఎకరాలు ఇలా మొత్తంగా 2014 ఎన్నికల ముందే వనపర్తి నియోజకవర్గంలో 87 వేల ఎకరాలకు ఆయకట్టు సాగునీరు ను వచ్చాయాని ఎమ్మెల్యే వివరించారు.

**కార్యకర్తలను ఎమన్నా వదిలేదు.... రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి చైర్మన్, డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి**

ప్రతి పక్ష నాయకులు ఎమ్మెల్యే ను నాయకులను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇట్లా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని కార్యకర్తలను ఒక్కమాట అన్న ఇకపై సాహించేది లేదని బదులుకు బదులు గట్టిగా ఉంటుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి చైర్మన్, డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ తదితర కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

### బుదేరా జూనియర్ కళాశాలలో

# విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ

**మునిపల్లి, ఆగస్టు 14(జనంసాక్షి):**



మునిపల్లి మండలంలోని బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి విద్యార్థికి 12 నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ సర్వంతోట శ్రీనివాస్, గ్రంథపాలకులు మన్నె రమేష్ విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాల కు హాజరై ఉన్నత లక్ష్యాలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రంథపాలకులు మన్నె రమేష్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి 12 నోటు పుస్తకాలు అందడం ఆనందదాయకమని, పుస్తకాలను సంరక్షిస్తూ శ్రద్ధగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం ముద్దం సిద్ధారెడ్డి, సుధాకర్, మారుతి, ఉదయ్ ప్రసాద్, అబ్బయ్య, సంజయ్, జి రమేష్ ఎస్. రవికుమార్, సిహెచ్ రవి, శ్రావణ్ కుమార్, అనుమహిత, జి.కవిత, హితేంద్రనాథ్ , విద్యార్థిని విద్యార్థు లు పాల్గొన్నారు.

# ముదిరెడ్డిపల్లిలో విద్యార్థులకు ఉచితంగా బూట్ల పంపిణీ

- **విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం**

**గుండుమాల్, ఆగస్టు 14 (జనంసాక్షి):** విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గుండుమాల్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా బూట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 48 మంది



విద్యార్థులకు బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బందెరి దేవమ్మ కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదువుతో పాటు వారి అవసరాలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యపై మరింత ఆసక్తి పెంపొందించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయులు రఘు, ఉప సర్పంచ్ సత్యమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సత్తయ్య, గ్రామ సంఘం మహిళా అధ్యక్షురాలు బోయ సావిత్రి, వార్డు సభ్యులు చెక్క బగ్గప్ప, బోయ మాసప్ప, చిన్న కృష్ణయ్య, కుర్వ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఇతర పార్టీల నుంచి గెలిచిన సర్పంచులకు ప్రభుత్వం సహకరించాలి

- **పేరుకే సర్పంచులు.. గ్రామాల్లో అధికార పార్టీ నేతల హవా**
- **రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయించాలి: కుర్మిద్ద సర్పంచ్ పుల్లగూర కృష్ణారెడ్డి**



కల్వకుర్తి,ఆగస్టు 14(జనం సాక్షి):కల్వకుర్తి కల్వకుర్తి మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏ పార్టీ తరఫున గెలిచినా సర్పంచులు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులేనని, వారికి ప్రభుత్వం సమానంగా సహకరించాలని కురుమిద్ద సర్పంచ్ పుల్లగూర కృష్ణారెడ్డి అన్నారు. ఇతర పార్టీల నుంచి గెలిచిన సర్పంచులను రాజకీయ కారణాలతో పక్కన పెట్టడం సరికాదన్నారు.గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సిన ప్రభుత్వం.. రాజకీయ భేదాలను పక్కనపెట్టి అన్ని గ్రామపంచాయతీలను సమానంగా చూడాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచులకు అధికారాలు ఉన్నా, నిధులు లేకపోతే గ్రామాల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పేరుకే సర్పంచులు.. పెత్తనం మాత్రం అధికార పార్టీ నేతలదే అన్నట్టుగా పరిస్థితులు మారకూడదన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఎన్నుకున్న సర్పంచులకే ప్రాధాన్యం ఉండాలని, ఇతరుల జోక్యాన్ని తగ్గించాలని సూచించారు. సర్పంచులు తమ గ్రామ ప్రజలకు జవాబుదారీగా ఉంటారని, వారి ద్వారా వచ్చిన సమస్యలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని అన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని కృష్ణారెడ్డి కోరారు. అన్ని గ్రామపంచాయతీలకు సమానంగా నిధులు విడుదల చేసి సర్పంచులకు పూర్తి సహకారం అందించాలని డిమాండ్ చేశారు.

# అనారోగ్యంతో యువకుడు మృతి

- **కుటుంబంలో తీవ్ర విషాదం**

**చేర్యాల/మద్దూరు, ఆగస్టు 14(జనంసాక్షి):** అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మద్దూరు మండలంలో విషాదం నింపింది. మండలంలోని మర్మాముల గ్రామ శివారు బంజేరకు చెందిన జంగిలి నరేష్(28) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.



చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. నరేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్న వయసులోనే అనారోగ్యానికి గురై మృతి చెందడం అత్యంత బాధాకరమని గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతునికి తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



## గ్రామ పంచాయతీలకు త్వరలో 16వ ఆర్థిక సంఘం నిధులు

• పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య

న్యాల్‌కల్, ఆగస్టు 14 (జనంసాక్షి): త్వరలోనే గ్రామ పంచాయతీలకు 16వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కానున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓ, సీనియర్ పర్యవేక్షకులు, ఏపీఓ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులకు అవగాహన కల్పించారు. విడుదల కానున్న 16వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న పనులు, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించనున్న పనులు, చేయూత పెన్షన్లు, తదితర అంశాలపై సర్పంచులు, అధికారుల బృందానికి కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షగుఫ్త ఇర్ఫత్, సీనియర్ పర్యవేక్షకులు నరేష్, ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పలువురు సర్పంచులు హాజరయ్యారు.

## 47 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ

• ఎలుక దేవయ్య సేవాభావం



బెజ్జంకి, ఆగస్టు 14(జనంసాక్షి): బెజ్జంకి మండలంలోని గుండారం ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన 47 మంది విద్యార్థులకు ఎలుక దేవయ్య సేవాభావంతో శుక్రవారం రూ.10 వేల విలువైన బూట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు రంగనాథ్,బెజ్జంకి మండల విద్యాధికారిణి మహతి లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బూట్లను అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుతున్నాయని, అందుకు గుండారం ప్రాథమిక పాఠశాలే నిదర్శనమని పేర్కొన్నారు.విద్యార్థులకు బ్యాడ్జీలను అందించిన ఎలుక శ్రీశైలంను,పాఠశాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన యువతను మండల విద్యాధికారిణి మహతి లక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో గుండారం గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి భీమయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వెయ్యాలి.. లేకుంటే పాదయాత్ర రాస్తారోక!

• కెసిఆర్ హయాంలోనే అభివృద్ధి
• 13 కోట్లతో రోడ్డు సాంక్షన్
• యూరియా కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి
• మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి..

నిజాంపేట, ఆగస్టు 14 (జనంసాక్షి): గత మూడు సంవత్సరాలుగా తీరని కోరికల చల్మెడ, నంద గోకుల్ గ్రామాల రోడ్డు దుస్థితి నెలకొందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం చల్మెడ కమాన్ వద్ద రోడ్డును శుక్రవారం ఆమె పరిశీలించారు. కమాన్ నుండి కంకర రోడ్డు ఎన్నో ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకున్న నాధుడు లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో 13 కోట్ల రూపాయలతో రోడ్డును మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేశారని, పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ నేపథ్యం లో పనులు నిలిపివేయడం జరిగిందని, నేటి ప్రభుత్వ హయాం లో.. ఈ రోడ్డు పనులు జరగడం లేదని ఆమె విమర్శించారు. వారం రోజుల్లో ఈ రోడ్డు పనులు ప్రారంభించకపోతే రాస్తారోక, ధర్నా, పాదయాత్ర వంటి కార్యక్రమాలను రెండు గ్రామాల ప్రజలతో కలిసి నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఈ రోడ్డు విషయాన్ని పూర్తిగా మర్చిపోయారు అన్నారు. ఈ రోడ్డు పనులు చెయ్యాలంటే కమిషన్లు ఇవ్వలేక కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి, పనులపై లేకపోయిందని విమర్శించారు. నస్కల్ - నిజాంపేట గ్రామాల మధ్య బ్రిడ్జ్ గత వర్షాలకు దెబ్బతిందని, ఆ బ్రిడ్జికి శాశ్వత మరమ్మ



త్తులు నేటికీ నోచుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేది కాదని, ఈ ప్రభుత్వ హయాంలో యూరియా కోసం రైతన్న ఎనలేని కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సంపత్, నర్సింలు, అబ్దుల్ అజీత్, అందే కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఖర్గేపై కులవివక్ష వ్యాఖ్యలు సిగ్గుచేటు

• బీజేపీ చర్యను ఖండించిన అరేళ్ళ యాదయ్య



బాలానగర్, ఆగస్టు 14(జనంసాక్షి): ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను బీజేపీ నాయకులు "శుద్ధీకరణ" పేరుతో శుద్ధి చేయడాన్ని బాలానగర్ మండల కాంగ్రెస్ ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ అరేళ్ళ యాదయ్య తీవ్రంగా ఖండించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం కల్పిస్తున్న సమయంలో ఒక సీనియర్ జాతీయ నాయకుడిని కులం పేరుతో అవమానించడం దురదృష్టకరమన్నారు. దశాబ్దాలుగా ప్రజాసేవలో కొనసాగుతున్న ఖర్గేను అవమానించడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలను, సామాజిక సమానత్వాన్ని అవమానించడమేనని అరేళ్ళ యాదయ్య అన్నారు. కులం, మతం పేరుతో మనుషుల మధ్య వివక్ష చూపే బీజేపీ ఆలోచనలు సమాజానికి హానికరమని విమర్శించారు. రాజకీయ భేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచే స్థాయికి దిగజారడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కుల వివక్షకు, అంటరానితన భావజాలానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వ్యతిరేకమని, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అరేళ్ళ యాదయ్య స్పష్టం చేశారు.

## సిద్దిపేటలో బంజారా భవన్‌కు స్థలం కేటాయించాలి

• తెలంగాణ గిరిజన సంక్షేమ జిల్లా అధ్యక్షులు బిక్షపతి నాయక్



నంగునూర్, ఆగస్టు 14(జనంసాక్షి): సిద్దిపేట పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ హైదరాబాద్‌లో సంతోష్ బీమ్, ఐఏఎస్, స్పెషల్ సెక్రటరీ టు గవర్నమెంట్, కమిషనర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. సిద్దిపేట నియోజకవర్గ కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను ప్రకటించినప్పటికీ, 3 సంవత్సరాలు అయినా ఇప్పటివరకు అధికారులు స్థలం కేటాయించలేదని వివరించారు. స్థలం కేటాయించాలని పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.సిద్దిపేట పట్టణంలో ఇతర కుల సంఘాలకు భవనాల కోసం స్థలాలు కేటాయించిన విధంగానే బంజారా కుల సంఘానికి కూడా స్థలం కేటాయించాలని కోరారు. ప్రతి సంవత్సరం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు, తీజ్ ఉత్సవాలు, బంజారా సంప్రదాయ పండుగలు నిర్వహించుకునేందుకు సరైన స్థలం లేక బంజారా సమాజం ఇబ్బందులు ఎదుర్కొంటోందని వివరించారు. వినతిని సానుకూలంగా పరిశీలించిన స్పెషల్ సెక్రటరీ సంతోష్ బీమ్ సిద్దిపేట పట్టణంలో బంజారా భవన్ కోసం త్వరలోనే స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భూక్య బిక్షపతి నాయక్, మాజీ సర్పంచ్, తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 200 మీటర్ల భారీ జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగా యాత్ర



కొడిపల్లి ఆగస్టు 14, (జనంసాక్షి): కొడిపల్లి మండల కేంద్రంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో 200 మీటర్ల భారీ తిరంగాతో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహణ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కొడిపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్, ఆధ్వర్యంలో జరిగగా ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, కొడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, తహసీల్దార్ కృష్ణ, ఎస్సై అమరేందర్ రెడ్డి, డిఏఫ్ఆర్వో పృథ్వీ, ఎంఈఓ బాలరాజు, హాజరు అయ్యారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా 200 మీటర్ల భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేసి విద్యార్థులతో, యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆండాలు, పోలీస్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల లెక్చరర్ లు, కొడిపల్లి ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ జగన్, దుర్గా గౌడ్, బ్రహ్మచారి, పుండరీకం గౌడ్, రాగుల భూమయ్య పటేల్, ఉడుత శ్రీనివాస్ గుప్తా, ఉడుత శ్రీధర్ గుప్తా, వార్డ్ మెంబర్ లు సింగూరి దేవేందర్, మక్బుల్, గుద్దంల శరత్, బిజెపి నాయకులు, పెద్ది సిద్ధిరాములు, కృష్ణ పటేల్, బూరగడ్డ సర్పంచ్ శేకులు, కార్యకర్తలు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భారత్ మాతా కీ జై నినాదాలతో దేశభక్తిని చాటారు. కార్యక్రమం చివరలో జాతీయ గీతాలాపనతో ముగిసింది.

# అవయవ దానంతో మరణానంతరం సైతం జీవించవచ్చు

• వనపర్తి రాజీవ్ చౌక్‌లో అవయవదాన అవగాహన కార్యక్రమం




వనపర్తి బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి): ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో అఖిలభారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొల్లి ఆదామ్ రాజ్ ఆధ్వర్యంలో అవయవ దాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బొల్లి ఆదామ్ రాజ్ మాట్లాడుతూ.. "మరణించిన తర్వాత కూడా మన అవయవాల ద్వారా ఇతరులను జీవింపజేయవచ్చు. మన కంటి కార్నియాను దానం చేసి చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. బ్రెయిన్ డెత్‌కు గురైన వారి అవయవాలను దానం చేయడం ద్వారా ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. మనం మరణించిన తర్వాత దానం చేసిన అవయవాలు మరొకరి శరీరంలో జీవిస్తాయి" అని అన్నారు.ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మృతదేహాలను దానం చేయడం ద్వారా వైద్య విద్యార్థులకు శరీర నిర్మాణంపై అధ్యయనం చేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. "చనిపోయి మట్టిలో కలిసిపోవడం కంటే అవయవదానం ద్వారా సాటి మనిషిని బతికిద్దాం. కుల, మత, జాతి భేదాలు లేకుండా మానవీయ కోణంతో ప్రతి ఒక్కరూ అవయవ దానంపై అవగాహన కలిగి ఉండాలి" అని పిలుపునిచ్చారు.అనంతరం బాయ్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవయవ దానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, అవయవ దానం ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో సాహితి కళావేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జితేందర్ గౌడ్, ప్రజాకవి జ్వాల, సామాజిక కార్యకర్త గంధం నాగరాజు, డీటీఎఫ్ జిల్లా నాయకుడు చిన్న రాములు, సీపీఐ జిల్లా నాయకుడు గోపాలకృష్ణ, టీజేపీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, జన విజ్ఞాన వేదిక నాయకుడు ఆది రఘు, పాస్టర్ శ్రీకాంత్, టీచర్ మురళి, డాక్టర్ బండారు శ్రీనివాసులు, గాయకులు నందిమల్ల రాములు, గురువేదం, ఆది శ్రవణ్ తదితర సామాజిక ఆలోచనాపరులు పాల్గొన్నారు.

## సీఎం సభను విజయవంతం చేయాలి: కాటా



**రామచంద్రపురం, ఆగస్టు 14 (జనంసాక్షి):** సంగారెడ్డిలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తన నివాసంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై సభకు ప్రజలను తరలించే ఏర్పాట్లపై చర్చించారు. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

## మంగంపేట తండా విద్యార్థులకు ఘన సన్మానం



**మహమ్మదాబాద్, ఆగస్టు14 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల పరిధిలోని,మంగంపేట్ తండాకు చెందిన, ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటారు. విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన అంగోత్ శివకుమార్, అసోం లోని గువాహటి భారతీయ సమాచార సాంకేతిక విద్యాసంస్థలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, కాత్రావత్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో వినోద్ సీటు సాధించారు.అనంతరం గ్రామ సర్పంచ్ ఎస్.గోపాల్,మాజీ సర్పంచ్ గీతపాండు, విద్యార్థులను, శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా, వారు మాట్లాడుతూ.. మారుమూల గిరిజన తండాకు చెందిన,విద్యార్థులు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో సీట్లు సాధించడం పట్ల చాలా గర్వకరమని అన్నారు. కార్యక్రమంలో కే.గోపాల్‌నాయక్, ఎస్.సుబ్యానాయక్, ఎం.మహేష్ నాయక్, కే.గోపాల్,కే.రవినాయక్,బీమ్లా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ 2026పై , బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు, జిపిఓలకు శిక్షణ

- ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు సన్నాహాలు



**తెలకపల్లి, ఆగస్టు 14(జనంసాక్షి):** ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా బూత్‌స్థాయి అధికారులు (బిఎల్ఓలు), బూత్‌స్థాయి సూపర్ వైజర్లు, జీపీఓలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించాల్సి ఉన్నందున, అందుకు సంబంధించిన విధివిధానాలు, చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అదేవిధంగా గైర్హాజరు, వలస వెళ్లిన, మరణించిన ఓటర్లకు (ఏఎస్‌డీ) సంబంధించిన వివరాలు, తార్కిక లోపాలు, వివరాల్లో వ్యత్యాసాలకు సంబంధించిన నోటీసులను సంబంధిత ఓటర్లకు పంపిణీ చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. నోటీసులు పంపిణీ చేసిన వివరాలను బూత్ స్థాయి అధికారి యాప్‌లో నమోదు చేసే విధానాన్ని కూడా సిబ్బందికి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి తహసీల్దార్ విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో వెంకట్, డీటీ లక్ష్మణ్ నాయక్ మాస్టర్ ట్రైనర్‌గా పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలను సిబ్బందికి వివరించారు.

## నిమ్స్‌లో బజారు బాలకృష్ణ పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**పెబ్బేరు, ఆగస్టు 14(జనంసాక్షి):** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని డబల్ బెడ్ రూము సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ టీఆర్ఎస్ నాయకులు బజారు హమాలీ కార్మికులు బాలకృష్ణను శుక్రవారం మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరామర్శించారు. తీవ్రగాయాలతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణను పరామర్శించి త్వరగా కోలుకోవాలని, అవసరమైన మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యులకు సూచించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో పాటు పెబ్బేరు పట్టణ పార్టీ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు దృష్టి సారించాలి..




**మహ్మదాబాద్, ఆగస్టు 14 (జనంసాక్షి):** వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, సూచించారు. శుక్రవారం మొకర్లాబాద్, నంచర్ల గ్రామాల్లో పర్యటించి, వరి,పెసర, కంది, పంటలను వ్యవసాయ సంచాలకులు రాంపాల్,మండల అధికారి ఏవో, నరేందర్, పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ..ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు.

**ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై అవగాహన...**


రైతులకు ఎరువులు సులభంగా,పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్,క్యూఆర్ కోడ్,బిల్లు పొందే విధానాలను అధికారులు వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నిఖిత, మైబయ్య, పాండయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బాలకిష్టయ్య, హన్మంత్ రామకృష్ణ,రాఘువేందర్, శ్రీను తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## బొడ్రాయి పవిత్రతకు భంగం

- భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్న పంచాయతీ కార్యాలయం
- పాత భవనంలోకి మార్చాలని డిమాండ్









**అచ్చంపేట, ఆగస్టు 14(జనంసాక్షి):** గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా కొలిచే బొడ్రాయి ప్రాంగణంలో గ్రామపంచాయతీ భవనం నిర్మించడంతో పవిత్రతకు భంగం కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పునుంతల మండలం, ఉప్పరపల్లి గ్రామంలోని బొడ్రాయి స్థలంలో 2024లో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పేర్కొన్నారు.

**ఒకే ప్రాంగణంలో పలు కార్యాలయాలు...**

గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు అదే ప్రాంగణంలో పోస్టాఫీసు, ఆరోగ్య కేంద్రం కూడా ఉండటంతో వివిధ పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడికి వస్తుంటారు. దీంతో బొడ్రాయి ప్రాంగణంలోకి చెప్పులతో వెళ్లడం, స్థలాభావంతో అక్కడే ఆహారపానీయాలు తీసుకోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. దీనివల్ల బొడ్రాయి వద్ద పవిత్రత దెబ్బతింటోందని, భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తీర్మానం చేసినా.. మార్పు ఏదీ?**

గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పాత భవనంలోకి మార్చాలని గతంలోనే పాలకవర్గం తీర్మానం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు కార్యాలయాన్ని మార్చకపోవడంతో సమస్య కొనసాగుతోందన్నారు. పాత భవనం విశాలంగా ఉండటంతో పాటు పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం, అవసరమైన వసతులు ఉన్నాయని పేర్కొన్నారు.

**అధికారులు స్పందించాలి...**

బొడ్రాయి పవిత్రతను కాపాడటంతో పాటు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పాత భవనంలోకి మార్చాలని సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు. సమస్యను ఇప్పటికే పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సెయింట్ ఆంటోనీ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా 'వందేమాతరం' 150 వసంతాల వేడుకలు



**సంగారెడ్డి, ఆగస్టు 14 (జనంసాక్షి):** భారతీయ స్వాతంత్ర్య సమరంలో కోట్ల మందిలో దేశభక్తిని రగిల్చిన జాతీయ గేయం 'వందేమాతరం' రచించబడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న (150 వసంతాల) శుభ సందర్భాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంటోనీ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఇ.విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపక బృందం కలిసి జాతీయ గీతం (జనగణమన), జాతీయ గేయం (వందేమాతరం) లను ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలపించారు. ఈ సందర్భంగా దేశభక్తి స్మరణతో కళాశాల ప్రాంగణం మారుమోగింది.

ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఇ.విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "భారత సంస్కృతి, సమైక్యతకు జాతీయ గీతం, జాతీయ గేయాలు ప్రతీకలు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో 'వందేమాతరం' ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేసింది. నేటి యువత, ముఖ్యంగా విద్యార్థినులు రక్షణలో, ప్రగతిలో భాగస్వాములు కావాలి. 150 ఏళ్ల పూర్తి చేసుకున్న వందేమాతరం గేయ స్ఫూర్తిని గుండెల్లో నింపుకొని ప్రతి ఒక్కరూ దేశ సేవకు పునరంకితం కావాలి" అని పిలుపునిచ్చారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపల్ జవహర్ సార్ మాట్లాడుతూ, "జాతీయ గీతం, జాతీయ గేయం మన దేశ సార్వభౌమత్వానికి, భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనాలు. వీటి ప్రాధాన్యతను, అంతరార్థాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి. క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన పౌరులుగా ఎదిగినప్పుడే విద్యకు సార్థకత లభిస్తుంది. కళాశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో జాతీయ భావాలు మరింత పెంపొందుతాయి" అని పేర్కొన్నారు.

కళాశాల అకాడమిక్ కౌన్సిలర్ డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ, "వందేమాతరం కేవలం ఒక గేయం కాదు, అది భారత మాతకు అర్పించిన అక్షర నీరాజనం. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఎందరో మహనుభావులను ఈ గేయం ముందుకు నడిపించింది. నేటి మహిళా విద్యార్థినులు ఆనాటి త్యాగాలను స్మరించుకుంటూ, విద్యా రంగంలో మరియు సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే దేశానికి మనం ఇచ్చే నిజమైన గౌరవం" అని ప్రసంగించారు.

ఈ అద్భుతమైన వేడుకలో అధ్యాపక బృందం, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కృష్ణా మండలంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి తక్షణ చర్యలు చేపట్టాలి



**కృష్ణ, ఆగస్టు 14 (జనంసాక్షి):** నూతనంగా అవతరించిన కృష్ణా మండలంలో పాఠశాల విద్య ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, సిబ్బంది కొరత వంటి పలు కీలక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారి నిజాముద్దీన్ రాష్ట్ర విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మండల విద్యాధికారుల సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్ట్ లకు ఆయన క్షేత్రస్థాయి సమస్యలతో కూడిన సమగ్ర వినతి పత్రాన్ని అందజేశారు.

మండలంలోని ప్రాధాన్యత కలిగిన కృష్ణా, ఆలంపల్లి, గురజాల పాఠశాలలకు తక్షణమే నూతన భవనాలను మంజూరు చేసి, విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని కోరారు. మండల వనరుల కేంద్రంలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేట ర్ ,సిఆర్పి పోస్టులను తక్షణమే భర్తీ చేసి, పాఠశాలల పర్యవేక్షణ, పరిపాలనా యంత్రాంగాన్ని వేగవంతం చేయాలన్నారు.

ఈ సందర్భంగా ఎంఈఓ నిజాముద్దీన్ మాట్లాడు తూ, మండలంలోని పాఠశాలల అభివృద్ధిపై ఇప్పటికే గౌరవ స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రివాకిటి శ్రీహరికి వినతిపత్రం సమర్పించి నట్లు తెలిపారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో, వెనుకబడిన వాతావర ణంలో ఉన్న నారాయణ పేట జిల్లాలోని కృష్ణా మండలం విద్యారంగంలో ముందంజ వేసేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం ద్వారానే గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయగలమని అన్నారు. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలన్నింటినీ త్వర లోనే పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బెజ్జంకి పీఏసీఎస్ చైర్మన్‌గా ఒగ్గు దామోదర్

- డైరెక్టర్లుగా 12 మంది ప్రమాణ స్వీకారం



**బెజ్జంకి, ఆగస్టు14,(జనంసాక్షి):** బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(ఫ్యాక్స్)కు నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి శుక్రవారం ముఖ్య అతిథిగా మండలానికి విచ్చేసిన మానకొండూరు ఎమ్మెల్యే,కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఒగ్గుడోల్ల చప్పడ్లతో, భారీ కాంగ్రెస్ మండల నాయకత్వంలో,కార్యకర్తలతో స్వాగత తోరణం తో భారీ ర్యాలీగా ఫ్యాక్స్ కార్యాలయానికి చేరుకునీ నూతన చైర్మన్, నూతన డైరెక్టర్ లకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం చైర్మన్ గా ఒగ్గు దామోదర్  మొదటగా ప్రమాణ స్వీకరం చేశారు.అనంతరం నూతన డైరెక్టర్లు ఎన్నికైన చెట్టి రాజు,నూనె రాజేందర్,కట్ట స్వరూప, అడకాని నర్సింగం,గంగాధర రామచంద్రం, కేడిక అపర్ణ,బైర రాజేందర్, తుమ్మ సుధాకర్‌రెడ్డి, మాచం శంకర్,లింగాల రామవ్వ, కొమ్మెర తిరుపతి, కుక్కల రాములు ఘనంగా ప్రమాణస్వీకారాలు చేశారు.ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు ఆర్థికంగా అండగా నిలవడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి అనీ అన్నారు. రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలకు సంబంధించిన సేవలు అందేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా సేవలు అందించడంతో పాటు సంఘం అభివృద్ధికి కృషి చేయాలి అనీ అన్నారు. నూతన చైర్మన్ ఒగ్గు దామోదర్ మాట్లాడుతూ తనపై నమ్మ కం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణకీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని, పీఏసీ ఎస్‌ను మరింత బలోపేతం చేసి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతన పాలకవర్గం సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తాము అనీ అన్నారు. అనంతరం నూతన (ఫ్యాక్స్) చైర్మన్,పాలకవర్గానికి అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు షాలువాలతో, పుష్పగుచ్చా లతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సహ కార సంఘం సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తది తరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ, డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు, కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ లెర్నింగ్‌ను విద్యాభ్యాసంలో సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 15 రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్నా అక్క మెంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా ఏఐ, డిజిటల్ లెర్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని ఐదవ సెమిస్టర్ విద్యార్థులు బిజినపల్లి మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, అక్కడి విద్యార్థులకు 15 రోజులపాటు ఏఐ, డిజిటల్ లెర్నింగ్ అంశాలపై అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా విద్యార్థులకు కృత్రిమ మేధస్సు అంటే ఏమిటి, ఏఐలోని ప్రాథమిక అంశాలు, విద్యారంగంలో ఏఐ వినియోగం, డిజిటల్ సాధనాల ఉపయోగం, ఆన్‌లైన్‌లో విద్యా వనరులను వినియోగించుకునే విధానం తదితర అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతికతను విద్యాభ్యాసంలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు తమ జ్ఞానాన్ని మరింత విస్తరించుకునే అవకాశాలపై కూడా అవగాహన కల్పించారు.15 రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ శిక్షణ కార్యక్రమానికి కళాశాల నోడల్ అధికారులు శివ దొడ్ల, బి. వెంకటేష్, ఏ. మనోజ్ కుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వారిని సాంకేతికంగా సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాములు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐ, డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించడంలో ఐదవ సెమిస్టర్ విద్యార్థులు చురుకైన పాత్ర పోషించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాములు, నోడల్ అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

### బీచుపల్లి ఆంజనేయ స్వామి

# సన్నిధిలో ఎంపీ డీకే అరుణమ్మ ప్రత్యేక పూజలు

- శ్రీ వ్యాసరాయ కళ్యాణ మండపం ప్రారంభించి హోమం నిర్వహణ



**ఎర్రవల్లి, ఆగస్టు 14 (జనంసాక్షి):** శ్రావణ శుక్రవారం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లి పుణ్యక్షేత్రంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పురేందర్ ఎంపీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కళ్యాణ మండపానికి "శ్రీ వ్యాసరాయ కళ్యాణ మండపం"గా నామకరణం చేశారు.అనంతరం ఎంపీ డీకే అరుణమ్మ పుణ్యవచనం, శాంతి హోమం, గణపతి పూజ, నవగ్రహాల పూజలు నిర్వహించారు. కళ్యాణ మండపంలో వివాహాలు జరుపుకునే వారికి సకల శుభాలు కలగా లని, అన్ని సౌకర్యాలు సమకూర్చి మండపాన్ని పునఃప్రారంభించినట్లు తెలిపారు.భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఆలయ అభివృద్ధి పనులు చేపడతామని, బీచుపల్లి క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ఎంపీ అరుణమ్మ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పోరాటం

- డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్
- పాలమూరులో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ



**మహబూబ్‌నగర్ బ్యూరో ఆగస్టు 14(జనంసాక్షి):** సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. హల్దాని ఘటనకు నిరసనగా, ఏఐసీసీ అధ్యక్షు రాలు మల్లికార్జున్ ఖర్గేకు సంఘీభావంగా డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ నాయకత్వంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, సత్యాగ్రహ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చారు. డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ హల్ద్వానిలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో నిర్వహించిన ర్యాలీ ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధీకరణ పేరుతో అవమానకరంగా వ్యవహ రించడం సరికాదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలాంటి సంఘటనలు అలవాటుగా మారిపోయాయని అన్నారు. ఖర్గే దళిత నాయకుడు అవడం వల్ల ఆయన సభ నిర్వహించిన ప్రాంతాన్ని శుద్ధి చేశారని, ఇది బీజేపీకి దళితుల పట్ల ఉన్న ఆలోచన విధానానికి అద్దం పడుతుందని విమర్శించారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్, నాయకులు వినోద్ కుమార్, మిథున్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, జహీర్ అఖ్తర్, చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, సీజే బెనహర్, నిత్యానందం, అశోక్ కుమార్, మినాజ్, పసుల రాజు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# డెత్ సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు వాస్తవమే!



**అచ్చంపేట, ఆగస్టు 14(జనంసాక్షి):** ఒకే వ్యక్తికి వేర్వేరు తేదీలతో డెత్ సర్టిఫికెట్లు జారీ చేసిన వ్యవహారంలో అధికార దుర్వినియోగ జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. 'ఆంధ్ర ప్రభ' లో ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం విచారణ చేపట్టారు.

పంచాయతీ డెత్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన రిజిస్టర్లు, దరఖాస్తులు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. విచారణలో ఇద్దరు వ్యక్తులకు వేర్వేరు తేదీల్లో డెత్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు గుర్తించినట్లు డీపీవో వెంకట్రసాద్ తెలిపారు.

**రికార్డుల పరిశీలన...**

డెత్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి ఉన్న రికార్డులను పరిశీలించిన అధికారులు, సంబంధిత దరఖాస్తులు, రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పంచాయతీ కార్యదర్శి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

**నివేదిక ఆధారంగా చర్యలు...**

డెత్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై సమగ్రంగా విచారణ నిర్వహించి నివేదిక రూపొందిస్తున్నట్లు డీపీవో వెంకట్రసాద్ తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో సంబంధిత రికార్డులు, దరఖాస్తులను పరిశీ లించి పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# రాజపేటలో బీఆర్ఎస్‌కు షాక్..

• కాంగ్రెస్‌లోకి సర్పంచ్ గౌడుగు ఎల్లన్న



వనపర్తి బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి): రాజపేట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామ సర్పంచ్ గౌడుగు ఎల్లన్న తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాలయ్య, విష్ణు, చంద్రయ్య, తిరుపతయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు.
మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ గత పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాములు, సహదేవుడు, దత్తయ్యపల్లి సర్పంచ్ వెంకటయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మతాలు వేరైనా మనమంతా ఒక్కటే

• ఆంజనేయస్వామి ఆలయానికి రూ.25 వేలు విరాళం అందజేసిన తల్పునూర్ ముస్లిం సోదరులు



రేవల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి): మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ, రేవల్లి మండలం తల్పునూర్ గ్రామంలో ముస్లిం సోదరులు గొప్ప ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామ మసీద్ కమిటీ సభ్యులు శుక్రవారం ఉదయం గ్రామంలో గల మజీద్ దగ్గర 25,000/- విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. స్థానిక ప్రజలు ముస్లిం సోదరుల సేవాభావాన్ని అభినందించారు. కుల మతాల గోడలను దాటి పరస్పరం సహకరించుకున్నప్పుడే సమాజంలో శాంతి, ఐక్యత, అభివృద్ధి సాధ్యమవుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నరసింహ, సభ్యులు నరేందర్ రెడ్డి, ఉత్తం రెడ్డి, బాలయ్య, కృష్ణయ్య, సురేష్, ఆంజనేయులు, నవీన్ కుమార్ తదితరులు, మసీద్ కమిటీ సభ్యులు యూసుఫ్, ఖాజా, ఫాజిల్, మైను, షఫీ, రఫీక్, మైబు, ఇలియాస్, అజీమ్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్త యూనిఫామ్స్ పంపిణీ




చేర్యాల, ఆగస్టు14(జనంసాక్షి): మండలంలోని ఆకునూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం నూతన యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కొత్త యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, కొత్త యూనిఫామ్స్ వల్ల విద్యార్థుల్లో చదువుపై మరింత శ్రద్ధ పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడిచెల్మి అయోధ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేటలో బిజెపి భారీ ర్యాలీ యాత్ర

• పాల్గొన్న రాష్ట్ర నేతలు



నారాయణపేట ఆగస్టు 14(జనంసాక్షి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలక తీతంగా శుక్రవారం ఉదయం 10గంటలకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీ స్థానిక బసవేశ్వర మందిరం నుంచి చౌక్ బజార్, సెంటర్ చౌక్, వీరసావర్కర్ చౌరస్తా గుండా సత్యనారాయణ స్వామి చౌరస్తా వరకు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్ పాండు రెడ్డి, సంగారెడ్డి ఇంఛార్జ్ పగడకుల శ్రీనివాసులు సీనియర్ నాయకులు కొండయ్య మాట్లాడుతూ ధర్మ రక్షణ దేశ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు జాతీయ జెండా ఆవిష్కరించి ఐక్యత ప్రదర్శించి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడురఘురామయ్యా గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల జిఆర్ రెడ్డి, కౌన్సిలర్ల, జిల్లా మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుడెబల్లూర్‌లో నూతన ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం

కృష్ణ, ఆగస్టు 14(జనంసాక్షి): మండల గుడెబల్లూర్ గ్రామంలో గడుగు మహేశ్వరి గడుగు లక్ష్మన్న, నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశము చేశారు. ఈ శుభకార్యంలో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు వాకిటి వారి కానుక వాస్తు బట్టలు సమర్పించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలిపాటేల్ విజయ్ గౌడ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్, మాజీ ఎంపీటీసీ వాకిటి నారాయణ, సీనియర్ నాయకులు కృష్ణ మూర్తి, సోమా సంతోష్, మాజీ ఎంపీటీసీ నాగప్ప, విశ్వనాథ్ గౌడ, కున్సీ పల్లే సురేష్, తమ్మప్ప, మెంబెర్ వెంకటేష్, వెంకటేష్, నాగేంద్ర, నాగేశ్వర్ రావు, నాయకులు కార్యకర్తలు, గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడిగా మారే నెహ్రూ చౌరస్తాకు శాశ్వత పరిష్కారం

• ఆక్రమణలు తొలగించి సీసీ రోడ్డుతో అభివృద్ధి చేసిన సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్





తెల్కపల్లి, ఆగస్టు 14, (జనంసాక్షి): మండల కేంద్రంలోని ప్రధాన కూడలైన నెహ్రూ చౌరస్తా (వివేకానంద చౌరస్తా) దశాబ్దాలుగా వర్షం పడితే చిత్తడి గా మారి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి ఎట్టకేలకు పరిష్కారం లభిస్తోంది. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్ చొరవతో శుక్రవారం చౌరస్తా అభివృద్ధి పనులు చేపట్టారు. శ్రీశైలం ప్రధాన రహదారిలో చౌరస్తా పరిసరాల్లో సుమారు పది అడుగుల మేర ఉన్న ఆక్రమణలను స్థానికుల సహకారం తో జేసీబీ ద్వారా తొలగించారు. వారం రోజులుగా శ్రమించి ఆక్రమణలను పూర్తిగా తొలగించిన అనంతరం సీసీ నిర్మాణ పనులు చేపట్టి చౌరస్తాకు నూతన రూపురేఖలు తీసుకొచ్చారు. సర్పంచ్ చొరవకు వివిధ రాజకీయ పార్టీల అఖిలపక్ష నాయకులు మద్దతు ప్రకటించి, నడిరోడ్డుపై ఉన్న పార్టీ దిమ్మెలను తొలగించేందుకు ముందుకు వచ్చారు. అభివృద్ధి పనులను స్థానిక యువత, వ్యాపారులు, ప్రజలు స్వాగతిస్తూ సర్పంచ్ చంద్రశేఖర్‌ను అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వారణాసి శ్రీను, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎం. యాదయ్య,, వార్డు సభ్యులు తదితరులు పాల్గొని సహకారాన్ని అందించారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని తాసిల్దార్‌కు మెమోరాండం సమర్పణ టీఎస్‌యూటీఎఫ్



అడ్డాకుల, ఆగస్టు 14(జనంసాక్షి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్య లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో గురువారం టీఎస్ యూటీఎఫ్ నాయకులు అడ్డాకుల తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. వెంకటేష్ మాట్లాడుతూ నూతన పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయడంతో పాటు హెల్త్ కార్డులు, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 21న జిల్లా కేంద్రంలో ధర్నా, 29న హైదరాబాద్‌లో మహాధర్నా, సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
కార్యక్రమంలో టిటియు జిల్లా అధ్యక్షుడు జుర్రు నారాయణ, మండల అధ్యక్షుడు నాగమద్దిలేటి, ప్రధాన కార్యదర్శి ఎస్. చిన్నయ్య, పిఎస్ ప్రధానోపాధ్యాయులు రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కళాశాలలో అవయవదానంపై అవగాహన సదస్సు



మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 14(జనంసాక్షి): మహబూబ్‌నగర్‌లోని స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ & పీజీ కళాశాల (అటానమస్)లిలిలో అఖిల భారత అవయవదాతల సంఘం సమన్వయంతో, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా పాల్గొన్న అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ వి. నటరాజ్ మాట్లాడుతూ, "మరణం తర్వాత శరీరం మట్టిలో కలిసిపోతుంది. కానీ అవయవాలను దానం చేస్తే అవి మరొకరి శరీరంలో జీవిస్తాయి. ఒక కుటుంబం తీసుకునే ధైర్యమైన నిర్ణయం మరో కుటుంబానికి కొత్త ఆశను, సరికొత్త జీవితాన్ని అందిస్తుంది. అందుకే ఇది సాధారణ దానం కాదు, జీవితాన్ని అందించే మహాదానం" అని అన్నారు.
తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ మరియు ఎస్.వి.ఎస్. మెడికల్ కాలేజీకి 273 కళ్లను, 18 డెడ్ బాడీలను దానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు.
ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ, "మన జీవితం ఒకరోజు ముగుస్తుంది. కానీ మన మానవత్వానికి ముగింపు ఉండకూడదు. మన హృదయం ఆగిపోయినా, మన మంచి నిర్ణయం మరొకరి జీవితంలో కొనసాగవచ్చు. మన కళ్ళు ఈ ప్రపంచాన్ని చూడకపోయినా, మరొకరు ఈ అందమైన ప్రపంచాన్ని చూడగలరు. అందుకే అవయవదానం చేయండి. జీవితాన్ని పంచండి. ఆశను పంచండి" అని అన్నారు.
కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ, "సమాజంలో అవయవదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయి. విద్యావంతులుగా, సైన్స్ విద్యార్థులుగా ఆ అపోహలను తొలగించాల్సిన బాధ్యత మనపై ఉంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు వచ్చి అవయవదానం చేస్తే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మనం తెలుసుకున్న విషయాలను మన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మరియు సమాజానికి చేరవేద్దాం. అవయవదానంపై అవగాహన పెంచుదాం, మానవత్వాన్ని చాటుకుందాం" అని అన్నారు.
ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ వేణుగోపాల్, బాబులెరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, రఘువీర్ గుప్త, అదిబాతాజ్, నసీంభాను, వెంకటరమణ మూర్తి, డాక్టర్ సి.హెచ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి చొరవతో
# ఖాన్ దొడ్డి పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం



**కృష్ణ, ఆగస్టు 14 (జనంసాక్షి):** మండలం ఖాన్ దొడ్డి గ్రామంలోని పాఠశాలల్లో నెలకొన్న తాగునీటి సమస్యను మంత్రి శ్రీహరి చొరవతో విద్యార్థులకు నీటి సమస్య పరిష్కారం అయింది. ఇది వరకు నీటి సమస్యను మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నూతనంగా బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంగోళ్ల వెంకటేష్ , ఉపసర్పంచ్ దుకాణం శ్రీనివాస్, మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి , కృష్ణ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజప్ప గౌడ మాలిపాటిల్ , యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సర్వరాజ్ , మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ , మాజీ ఎంపీటీసీ వాకిటి నారాయణ, ప్రధానోపాధ్యాయులు మోహన్, వెంకటేష్ నర్సప్ప. నూకలి తిప్పయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె సురేష్, సుదర్శన్, తమ్మప్పతో ,పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కృష్ణ మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్. తారేష్. అభిమానులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణకు శ్రీకారం

**సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో 2వ బ్యాచ్ ప్రారంభం**
**ఆగస్టు 16 నుంచి ఓల్డ్ కృష్ణవేణి జూనియర్ కాలేజ్‌లో తరగతులు**




**కల్వకుర్తి,ఆగస్టు 14(జనంసాక్షి):** పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్న నియోజకవర్గ గ్రామీణ ప్రాంత యువతకు చేయూత అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ రెండో బ్యాచ్‌కు ఆగస్టు 16 నుంచి శ్రీకారం చుట్టనున్నారు. కల్వకుర్తిలోని ఓల్డ్ కృష్ణవేణి జూనియర్ కాలేజ్ బిల్డింగ్‌లో, ఎంఆర్వో కార్యాలయం ఎదురుగా శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, గూూఖ జూూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొదటి బ్యాచ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో రెండో బ్యాచ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.
రాష్ట్రస్థాయి అధ్యాపక బృందంతో నాణ్యమైన శిక్షణ అందించనున్నారు. ప్రతిరోజూ 9 గంటలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు రోజువారీ పరీక్షలు, వారాంతపు గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. తాజా సిలబస్‌కు అనుగుణంగా పాఠ్యాంశాలను బోధించడంతోపాటు గణితం లేని విభాగాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నారు.
శిక్షణ పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో చేరాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వివరాలకు 6300553467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# స్వతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి):** స్వతంత్ర దినోత్సవ వేడుక లను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్ తదితర అధికారులతో కలిసి వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించా రు. స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రజలు, విద్యార్థులు, అధికారులు హాజర య్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థులు మరియు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేడుకల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, వీఐపీలు, ప్రజలు, విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో చర్యలు చేపటాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదన పు ఎస్పీ రియాజ్ హుల్ హక్ పోలీస్ శాఖ తరపున చేపట్టిన భద్రతా ఏర్పాట్లను వివరించారు. పరేడ్, ప్రజల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత పోలీ స్ అధికారులకు అవసరమై న సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహ సీల్దార్, టౌన్ ఎస్ఐ వెంకటే శ్వర్లు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- **ముసాయిదా ఓటరు జాబితాపై బీఎల్ఓలకు సమగ్ర అవగాహన కల్పించాలి**
- **కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**







**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ ఐడీఓసీలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో మండల స్థాయి బీఎల్ఓ ట్రైనర్లకు ఎస్ఐఆర్ తదుపరి ప్రక్రియపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్‌తో కలిసి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో బీఎల్ఓలు చేపట్టాల్సిన కార్యాచరణపై 18 మంది మండల స్థాయి ట్రైనర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకుండా, అనర్హుల నమోదుకు అవకాశం లేకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 84 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, వయస్సు వ్యత్యాసాలు, ఇతర వివరాల్లో లోపాలు వంటి తొమ్మిది రకాల సమస్యలతో సుమారు 1.02 లక్షల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సంబంధిత వివరాలను నిశితంగా పరిశీలించి, అర్హులైన ఓటర్లకు నిబంధనల మేరకు జాబితాలో చోటు కల్పించాలని ఆదేశించారు. మ్యాపింగ్ కాని ఓటర్లకు నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేలా బీఎల్ఓలు అవగాహన కల్పించాలని సూచించారు. నోటీసుల జారీ, పత్రాల స్వీకరణ, ధ్రువీకరణ, ఆన్‌లైన్ అప్‌లోడ్, ఛాయాచిత్రాల నమోదు, విచారణ వివరాల డిజిటల్ రికార్డు వంటి అంశాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, పేరు తొలగింపునకు ఫారం-7, పేరు, చిరునామా, ఛాయాచిత్రం తదితర వివరాల సవరణకు ఫారం-8 వినియోగిస్తారని కలెక్టర్ వివరించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే అర్హులైన యువత ఫారం--6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన మండల స్థాయి ట్రైనర్లు తమ పరిధిలోని బీఎల్ఓలకు యాప్ తదుపరి కార్యాచరణపై ప్రాయోగిక శిక్షణ ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓ ట్రైనర్లు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ మినీ గ్యాస్ సిలిండర్ల తయారీ గుట్టురట్టు





**నలుగురిని అరెస్ట్**

**రాజాపూర్, ఆగస్టు 14 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి శివారులో అనుమతులు లేకుండా మినీ గ్యాస్ సిలిండర్ల తయారీ, రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి 750 మినీ గ్యాస్ సిలిండర్లు, బొలేరో వాహనం, 7 తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 12న గగన్‌పహాడ్ మెయిన్‌రోడ్డులో 400 సిలిండర్లతో వెళ్తున్న మహమ్మద్ అబ్దుల్ హన్నాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, భోలేషా సూచనల మేరకు రవాణా చేస్తున్నట్లు వెల్లడించాడు. భోలేషా ద్వారా ట్రూప్‌బజార్‌కు చెందిన మహమ్మద్ షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. షకీల్ సమాచారంతో ముదిరెడ్డిపల్లి శివారులోని గోదాముపై దాడి చేసి, ఢిల్లీ మోతీనగర్‌కు చెందిన ఎండీ దిల్‌షాద్‌ను అరెస్ట్ చేసి 350 సిలిండర్లు, 7 యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో నిందితులపై కేసులు నమోదు చేశారు. పోలీసుల సూచనల మేరకు ప్రజలు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే సిలిండర్లు కొనుగోలు చేయాలని, అనుమానాస్పద సిలిండర్ల వినియోగాన్ని నివారించాలని కోరారు.

# కొబ్బరి పీచులపై మహిళలకు అవగాహన కేంద్రాలు

- **ఏటీఎం కృష్ణ తేజ**




**చిన్నశంకరంపేట, ఆగస్టు 15(జనంసాక్షి):** ప్లాస్టిక్ నిర్మూలన కోసమే కొబ్బరి పీచుల బొమ్మల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఏజీఎం కృష్ణ తేజ అన్నారు. చిన్నశంకరంపేట మండలం చందంపేట లో శుక్రవారం మహిళా సమైక్య సంఘాల ఆధ్వర్యంలో కొబ్బరి పీచుల తయారీ డ్వాక్రా సంఘాల పనితీరు ప్రతి ఒక్క సభ్యురాలికి పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని అన్నారు. ఏపీఎం రాములు మాట్లాడుతూ, మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,తీసుకున్న రుణాలు సక్రమంగా బ్యాంకులో జమ చేయాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం కృష్ణ తేజ,సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్,ఉపసర్పంచ్ నర్సింలు,పాలకవర్గం సభ్యులు,ప్రోగ్రాం కోఆర్డినేటర్ గోపిరెడ్డి, ఏపీఓ రాములు,సీసీ యశోద,వివో లత మహిళా సంఘాల నాయకురాలు పాల్గొన్నారు.

### 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు

# ముస్తాబవుతున్న మహబూబ్‌నగర్ పరేడ్ గ్రౌండ్

**• ఆగస్టు 15 వేడుకలకు సిద్ధమవుతున్న నగరం పరేడ్ గ్రౌండ్‌లో అధికారుల సన్నాహాలు**



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి);** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సర్వం సిద్ధం చేస్తున్నారు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబవుతోంది ముస్తాబవుతోంది. జిల్లా ప్రధాన వేడుకలు జరిగే పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈసారి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం పోలీసుల మార్చ్‌ఫాస్ట్, గౌరవ వందనం, ఆకర్షణీయ కవాతు ఉంటుం ది. విద్యార్థులు, వివిధ ప్రభుత్వ శాఖలు దేశభక్తిని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా టాబ్లూ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, నృత్యాలు ప్రదర్శించనున్నారు.వీవీపీలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు, మీడియా ప్రతినిధుల









కోసం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, షామియానాలు, సౌండ్ సిస్టమ్ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రతా ఏర్పాట్లను కూడా కట్టుదిట్టం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశభక్తి భావాన్ని, జాతీయ సమైక్యతను చాటేలా వేడుకలను నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే పరేడ్ మైదానంలో రంగులు, బ్యానర్లు, జాతీయ జెండాలతో అలంకరణలు ఊపందు కోవడంతో స్వాతంత్ర్య దినోత్సవ సందడి నెలకొం

### పంద్రాగస్టు ఏర్పాట్లను

# పరిశీలించిన జిల్లా కలెక్టర్ కే.హేమావతి



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి):** 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వాణ కోసం జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయ ఆవరణలో గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి వచ్చే ముఖ్య అతిథికి, ఇతర వివిఐపి లకు, అధికారులకు, మీడియా వారికి, విద్యార్థులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వర్షాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని, జాతీయ సమైక్యత ప్రతిబింబించేలా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ముందస్తు నిర్దేశించిన సమయం ప్రకారం పోలీస్ పెరేడ్, ముఖ్య అతిథి ప్రసంగం, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రశంస పత్రాల ప్రధానం తదితరలు అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేజి డెకరేషన్, సౌండ్ సిస్టం ఏర్పాటు, వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ సదానందం, తహసీల్దార్ కిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మానవపాడు మండలంలో MRO ఆఫీసిలో సిబ్బంది కొరత.. ప్రజలకు తప్పని ఇబ్బందులు



**మానోపాడు, ఆగస్టు13(జనంసాక్షి):** మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్. రేవెనివ్వ ఇన్స్పెక్టర్ కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిబ్బంది అందు బాటులో లేకపోవడంతో వివిధ పను లకు సంబంధించిన ఫైళ్లు ముందుకు కదలక పోవడంతో ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో వేచి చూసినా పనులు పూర్తికాకపోవడంతో నిరాశతో ఇంటికి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై MRO వివరణ కోరగా, "సిబ్బంది కొరత చాలా ఉంది" అని తెలిపారు. సిబ్బంది కొరతను వెంటనే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# సింగారంలో పంటల పరిశీలన - రైతులకు సమగ్ర వ్యవసాయ సూచనలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 14(జనంసాక్షి):** నారాయణపేట మండలం సింగారం గ్రామంలో రైతుల పొలాలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, నారాయణ పేట సమన్వయకర్త డా. ఈటెల సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, వ్యవసా య విస్తరణ అధికారి అని ల్ సందర్శించి వరి, పత్తి, కంది పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సంద ర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి పంటల ప్రస్తుత స్థితి, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, తెగుళ్లు మరియు చీడపీడల నియం త్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

**వరి పంటలో ఎరువుల వినియోగం...**

వరి పంటలో నత్రజని ఎరువులను ఒకేసారి కాకుండా పంట దశలను బట్టి విడతలుగా వేయాల ని, భాస్వరం, పొటాష్ ఎరువులను అవసరానికి అనుగుణంగా వినియోగిం చాలని సూచించారు. ముఖ్యంగా పైరుకు అవస రమైన సమయంలో నత్రజ ని అందించడం ద్వారా మంచి పెరుగుదల, దిగుబ డి సాధించవచ్చని తెలిపా రు. అధిక మోతాదులో యూరియా వాడకాన్ని నివారించాలని రైతులకు సూచించారు.

**పత్తి పంటలో సమతుల్య పోషక యాజమాన్యం...**

పత్తి పంట ప్రారంభ దశలో అవసరమైన ప్రాథమిక ఎరువులతో పాటు, పంట ఎదుగుదల దశను బట్టి నత్రజని, పొటాష్‌ను విడత లుగా అందించాలని తెలి పారు. అధికంగా యూరి యా వినియోగించడం వల్ల పంటలో అధిక వృక్ష పెరు గుదల ఏర్పడి పూత, కాయల ఏర్పాటుపై ప్రతి కూల ప్రభావం చూపే అవ కాశం ఉందని రైతులకు వివరించారు.

**కంది పంటలో వాడిపోయే తెగులు నివారణ...**

కంది పంటను పరిశీలించిన అధికారులు విల్ట్ (ఎండు తెగులు) లక్షణాలను గుర్తించి, వ్యాధి సోకిన మొక్కలను పొలంలో ఉంచకుండా తొలగించి నాశనం చేయాలని సూచించారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా తగిన డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, పంట మార్పి డిని పాటించాలని తెలిపా రు. విత్తన శుద్ధి, జీవ నియంత్రణ పద్ధతులు అవసరమైనప్పుడు సిఫా రసు చేసిన శిలీంద్రనాశ కాలను ఉపయోగించడం ద్వారా విల్ట్‌ను నియంత్రిం చవచ్చని వివరించారు.

**కంది పంటలో కలుపు నివారణ...**

కంది పంటలో ప్రారంభ దశలోనే కలుపు మొక్కల ను సమర్థవంతంగా నియం త్రించాలని అధికారులు సూచించారు. పంట దశ, నేల పరిస్థితి మరియు కలుపు రకాలను బట్టి సిఫా రసు చేసిన కలుపు నివార ణ మందులను లేబుల్ సూచనల ప్రకారం ఉపయో గించాలని తెలిపారు. అవ సరమైన చోట అంతరకృషి, చేతి కలుపు తగిన హెర్బి సైడ్‌లను సమగ్ర కలుపు యాజమాన్యంలో భాగంగా వినియోగించాలని సూచిం చారు.ఈ సందర్భంగా డా. ఈటెల సత్యనారాయణ మాట్లాడుతూ, రైతులు ఎరువులు, పురుగుమం దులు,కలుపు నివారణ మందులను తమ ఇష్టాను సారం కాకుండా పంట దశ, నేల పరిస్థితి శాస్త్రీయ సిఫారసుల ప్రకారం వినియోగించాలని సూచిం చారు. పంటల్లో సమస్యలు కనిపించిన వెంటనే వ్యవ సాయ శాఖ అధికారులను సంప్రదించి సరైన యాజ మాన్య పద్ధతులను పాటిం చాలని రైతులకు తెలి పారు.రైతుల పొలాలను నేరుగా సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలిస్తూ, సమస్యలకు క్షేత్రస్థాయిలో నే శాస్త్రీయ పరిష్కారాలను అందించడం ద్వారా తెలం గాణ రైతు విజ్ఞాన కేంద్రం, నారాయణపేట రైతులకు నిరంతరం సాంకేతిక సహ కారం అందిస్తుందని అధికారులు తెలిపారు.

# గిరిజన తండాల సర్వతోముఖాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**• పెద్దగూడెం తండాల అభివృద్ధికి రూ.3కోట్లు**



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి):** గిరిజన తండాల సర్వతో ముఖాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రభు త్వం ఏర్పడిన 30 నెలల కాలంలో పెద్దగూడెం తండాల అభివృద్ధికి సుమారు రూ.3 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు తెలిపారు.పెద్దగూడెం తండాలో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు రెండు మహిళా సమైక్య భవనాలను ప్రారంభించారు. అలాగే అంగన్వాడీ కేంద్ర భవనం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, మహిళా సంఘాలకు అవసరమైన వసతులు కల్పించడం, చిన్నారులకు మెరుగైన అంగన్వాడీ సౌకర్యాలు అందించడం, గ్రామపంచాయతీ లకు సొంత భవనాలు నిర్మించడం ద్వారా తండాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే...**

అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులతో సుమారు 20 నిమిషాల పాటు ముచ్చటించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించారు. విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు క్రీడా నైపుణ్యాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు...**

పెద్దగూడెం తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఆనందాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో సొంత ఇంటి కల నెరవేరిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తండా సర్పంచ్ వాల్యా నాయక్, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ ప్రొఫైలింగ్‌లో వనపర్తికి రాష్ట్ర ప్రథమ స్థానం



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి):** సైబర్ ప్రొఫైలింగ్‌లో వనపర్తి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఈఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో నిర్వహించిన 'సురక్ష కా తిరంగా - సైబర్ నేర రహిత తెలంగాణ వైపు' రాష్ట్రస్థాయి సైబర్ అవగాహన కార్యక్రమంలో ఈ గుర్తింపు లభించింది. వనపర్తి జిల్లా ఎస్పీ  సునిత రెడ్డి, నేతృత్వంలో జిల్లా సైబర్ విభాగం సమన్వయ సెక్యూర్డ్ ప్రొఫైలింగ్‌లో విశిష్ట ప్రతిభ కనబరిచింది. సైబర్ నేరస్థుల వివరాల సేకరణ, ప్రొఫైలింగ్, సమాచార విశ్లేషణలో విభాగం కనబరిచిన ప్రతిభకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం దక్కింది. ఈ సందర్భంగా వనపర్తి డీఎస్పీ గిరిబాబు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, నేరస్థుల గుర్తింపు, సమాచార విశ్లేషణలో వనపర్తి సైబర్ విభాగం సాధించిన ఈ ఘనత జిల్లా పోలీసులకు గర్వకారణంగా నిలిచింది. ప్రజలు అనుమానాస్పద లింకులు, మోసపూరిత కాల్స్, నకిలీ సందేశాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జిల్లా సైబర్ విభాగానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించడం పోలీసుల సమిష్టి కృషి, సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనమని ఎస్పీ సునిత రెడ్డి అభినందించారు.

## నాడు గలగల... నేడు వెలవెల

- నిండని చెరువులు, పారని వాగులు





**నారాయణపేట ఆగస్టు 14 (జనంసాక్షి):** గతేడాది ఇదే సమయంలో నారాయణపేట మండలం, సింగారం వాగు గలగల పారుతూ కనువిందు చేసింది. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక వాగు వెలవెలబోతుంది. వర్షకాలం మొదలై రెండు నెలలు దాటిన ఇంతవరకు భారీ వర్షాలు కురువక పోవడంతో ఎగువన  శ్యాసన్ పల్లి శివారులోని చిన్నోని చెరువులో కూడా నీరు లేక వట్టిపోయింది. చిన్నోని చెరువు, జయమ్మ చెరువులు నిండి అలుగు పారితే సింగారం వాగుకు జలకళ వచ్చే అవకాశం ఉందని, రెండు నెలల పాటు నిరంతరంగా వాగు ప్రవహిస్తే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. వాగుపై గంపెడు ఆశలు పెట్టుకున్న రైతులు. ఇలాగే కొనసాగితే ఖరీఫ్ పంటలపై ప్రభావం. యాసంగి పంటలు ప్రశ్నార్థకం...!

## పోలేపల్లి గ్రామంలో
## అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటన



**జడ్చర్ల, ఆగస్టు 14 (జనంసాక్షి):** మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో శుక్రవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను అదనపు కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, పరిశుభ్రతపై సమీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత లోపిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా 'డ్రై డే' పాటించి నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని అధికారులను, గ్రామస్తులను ఆదేశించారు.

## 18 బైకుల చోరీ కేసు ఛేదన.. అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.12.50 లక్షల విలువైన బైకులు స్వాధీనం - నలుగురు నిందితుల అరెస్ట్





**వనపర్తి /పెబ్బేరు, ఆగస్టు 14 (జనంసాక్షి):** జల్సాల కోసం బైక్ దొంగతనాలను వృత్తిగా మార్చుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుసగా బైకులు చోరీ చేస్తున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పెబ్బేరు పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.12.50 లక్షల విలువైన 18 చోరీ బైకులకు సంబంధించిన వివరాలను పోలీసులు రాబట్టారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, శుక్రవారం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. చెలిమిల్ల గ్రామానికి చెందిన కుర్వ శ్రీరాములు తన బైక్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో పెబ్బేరు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో రంగాపూర్ గ్రామ శివారులోని గుర్రంగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టగా, పోలీసులను గమనించిన అమీర్ హంజా పఠాన్ బైక్‌ను అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తన సోదరుడు పఠాన్ నబీఖాన్‌తో కలిసి బైకులు చోరీ చేస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పాత బైకులు, తాళాలు సరిగా పనిచేయని వాహనాలు, సైడ్ లాక్ వేయకుండా పార్కింగ్ చేసిన బైకులు, తాళాలు పెట్టి నిర్లక్ష్యంగా వదిలిన వాహనాలను నిందితులు ప్రధానంగా టార్గెట్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. గత రెండు నెలల్లో తెలంగాణలో 8, ఆంధ్రప్రదేశ్‌లో 10 చొప్పున మొత్తం 18 బైకులను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన బైకులను ఆత్మకూరుకు తరలించి విక్రయించేందుకు లింగాపురం గ్రామానికి చెందిన రమేష్, వెంకటరమణలతో నిందితులు ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెబ్బేరు, కొత్తకోట, గద్వాల, మానోపాడు, శాంతినగర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, దోర్నాల, పాణ్యం, ఎర్రగొండపాలెం, మార్కాపురం తదితర ప్రాంతాల్లో బైకులు చోరీ చేసినట్లు విచారణలో తేలింది.

**నిందితులపై పలు కేసులు...**

ప్రధాన నిందితుడు అమీర్ హంజా పఠాన్‌పై గతంలో ఒక కేసు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. అతని సోదరుడు పఠాన్ నబీఖాన్‌పై హత్య, ఎస్సీ--ఎస్టీ అట్రాసిటీ, దొంగతనం, పీడీ యాక్ట్ తదితర తీవ్రమైన కేసులు కలిపి 14 కేసులు ఉన్నట్లు వెల్లడించారు. నబీఖాన్ ఇప్పటికే 13 సార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, బైక్ పార్కింగ్ సమయంలో హ్యాండిల్ లాక్, సైడ్ లాక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. తాళాలు పెట్టి వాహనాలను నిర్లక్ష్యంగా వదిలిపెట్టవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్‌లను ఎస్పీ అభినందించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, కానిస్టేబుళ్లు నరసింహ, విజయ్, రైటర్ ఆంజనేయులులను నగదు బహుమతితో అభినందించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలం ఇదే

- మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతం యంగ్ ఇండియా పాఠశాలకు ఇదే అనువైన స్థలం
- జగదేవ్‌పూర్‌లో పాఠశాల ఏర్పాటు చేస్తే మూడు జిల్లాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది

**జగదేవ్‌పూర్, ఆగస్టు 14 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే  ఉద్దేశంతో ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో సైతం కార్పోరేట్ స్థాయిలో యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గజ్వేల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా పాఠశాలను జగదేవ్ పూర్ మండలం  కేంద్రంలో నెలకొల్పితే మూడు జిల్లాల సరిహద్దులో ఉన్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. జగదేవ్ పూర్ మండల కేంద్రం భౌగోళికంగా  జనగామ, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలకు సరిహద్దున ఉంటుంది. దీంతో  ప్రతినిత్యం ఆయా జిల్లాల నుంచి సమీప గ్రామాల్లోనీ  ప్రజలు జగదేవ్ పూర్ మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా ప్రస్తుతం జగదేవ్ పూర్ లోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా మూడు జిల్లాలకు చెందిన విద్యార్థుల సైతం విద్యనభ్యసిస్తుండడం ఇక్కడ ఉదాహరణంగా చెప్పవచ్చు.

యంగ్ ఇండియా పాఠశాల ఏర్పాటుకు కూడా సరిపడు స్థలం ఉంది

జగదేవ్ పూర్ ప్రాంతంలో విద్యారంగం అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎండపల్లి యాదగిరి రెడ్డి అనేదాత 50 సంవత్సరాల క్రితం  41. 20 ఎకరాల స్థలాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విరాళంగా ఇచ్చారు. అయితే గత ఐదు దశాబ్దాలుగా సంబంధిత స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా నిరుపయోగంగా ఉంది. గత పది సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ఇక్కడ బాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. కానీ పరిపాలన పరమైన కారణాల మూలంగా గురుకుల పాఠశాల ఏర్పాటుకు ఇప్పటికీ  నోచుకోలేదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు ప్రక్రియ ప్రకటించిన వెంటనే జిల్లా అధికార యంత్రాంగం జగదేవ్ పూర్ జూనియర్ కళాశాల స్థలాన్ని పరిశీలించింది.

**జగదేవ్‌పూర్‌లోనే యంగ్ ఇండియా పాఠశాలను ఏర్పాటు చేయాలి... ప్రజా ప్రతినిధులు నాయకుల విజ్ఞప్తి**

విద్యారంగంలో వెనుకబాటుకు గురవుతున్న జగదేవపూర్ మండలంలో ప్రభుత్వం ప్రకటించిన యంగ్ ఇండియా పాఠశాల ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు. మూడు జిల్లాల సరిహద్దున ఉన్న జగదేవ్ పూర్ మండలంలోని పరిసర గ్రామాల్లో ఎంతోమంది నిరుపేద విద్యార్థులు సరైన విద్యావకాషాలు లేక నిరుత్సాహంతో అర్ధాంతరంగా మధ్యలోనే తమ చదువులకు స్వస్తి పలుకుతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇక్కడ విద్యారంగ పరిస్థితులపై సానుకూలంగా స్పందించి యంగ్ ఇండియా పాఠశాల ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కష్టపడి చదవాలి: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్



**తూప్రాన్, ఆగస్టు 14(జనంసాక్షి):** విద్యార్థి ఇష్టపడి కష్టపడి చదివి ఉన్నత స్థానాలలో చేరాలని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ తెలిపారు. తూప్రాన్ మున్సిపాలిటీ లోని 7వ వార్డు అల్లాపూర్ పాఠశాల విద్యార్థులకు తన స్వంత నిధులతో స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణి చేసిన సందర్భంగా మాట్లాడారు ఇలాంటి సహాయ సహకారాలు కావాలని అందిస్తానని మంచిగా చదువుకోవాలని తల్లి దండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. కౌన్సిలర్ మన్నె స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ సమతా కాశి రెడ్డి ఎంఈఓ సత్యనారాయణ  కౌన్సిలర్లు కౌన్సిలర్  స్వామి మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఊరికి మంచి పేరు తేవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.